# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 214 | హైదరాబాద్ | సోమవారం 16-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా



## భారత్ బౌలర్ల ధాటికి
# పాక్ విలవిల..

- 34 పరుగులకే 4 వికెట్లు డౌన్!
- టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో భారత అమీతుమీ
- తొలుత బ్యాటింగ్ చేసి 175 పరుగులు చేసిన టీమిండియా
- మెరుపు అర్ధశతకంతో చెలరేగిన ఇషాన్ కిషన్ (77)
- భారత బౌలర్ల దెబ్బకు ఒత్తిడిలో పాక్

11లో

## నల్లమలలో బంజారాలకు
# మరో మేడారం..

**20 ఎకరాల్లో సేవాలాల్ పుణ్యక్షేత్రం: సీఎం రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం**

- నల్లమలలో ఆధ్యాత్మిక క్షేత్రం
- మేడారం తరహాలో అభివృద్ధి
- ప్రతి తండాకు బీటీ రోడ్డు, స్కూల్, పంచాయతీ భవనం.
- మున్సిపల్ ఎన్నికల ఫలితాల బాధ్యత నాదేనని చెప్పడానికే 'నేనే రాజు-నేనే మంత్రి' అన్నాను
- గిరిజన బిడ్డలకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నాం.
- సీఎం రేవంత్ కీలక ప్రకటన



11లో



11లో

## ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ
# భారత్ వద్ద ఉన్నాయి

- ఏఐలో భారత్ పూర్తిస్థాయి లీడర్‌గా ఎదుగుతుందన్న శామ్ ఆల్ట్‌మన్
- చాట్‌జీపీటీకి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ భారత్
- భారత్‌లో వారానికి 10 కోట్ల యాక్టివ్ యూజర్లు ఉంటున్నారని వెల్లడి
- భారత్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని ప్రకటన
- ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే సూచనలు

## తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో
# హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

- భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

11లో



## నేడు ఏపీలో బిల్ గేట్స్ పర్యటన



- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి
- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం

11లో

# కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం: మంత్రి నారా లోకేశ్ భరోసా

- మేడారం జాతరలో కర్నూలు చిరు వ్యాపారికి వేధింపులు
- 'ఫుడ్ జిహాద్' ఆరోపణలతో వేధింపులకు పాల్పడిన యూట్యూబర్లు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
- బాధితుడు వలీకి క్షమాపణ చెబుతూ ట్వీట్
- త్వరలోనే వలీని కలుస్తానని, కోవా బన్ తింటానని హామీ

11లో



# రైతులకు పూర్తి రక్షణ..
## రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు : అమిత్ షా

- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు
- ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్



11లో



# 'బిల్డ్ నౌ'.. అవినీతికి అక్షయపాత్ర!

ఒక ఊరిలో దొంగల భయం ఎక్కువైందని, ఊరి పెద్ద ఒక అత్యాధునిక 'డిజిటల్ తాళం' కనిపెట్టాడు. "ఇకపై ఎవరూ లోపలికి రాలేరు, అంతా పారదర్శకం" అని ఊరంతా చాటాడు. కట్ చేస్తే.. ఆ తాళం చెవి దొంగల చేతిలోనే ఉంది! లోపల సామాన్యుడి సొమ్ము లూటీ అవుతుంటే, బయట మాత్రం తాళం భలే మెరుస్తోంది అని ఊరి పెద్ద మురిసిపోతున్నాడు. 'బిల్డ్ నౌ' పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే ఉంది—సాఫ్ట్‌వేర్ ముసుగులో లోపల జరుగుతున్నది మాత్రం పక్కా 'సిస్టమిక్' దోపిడీ!

- సాఫ్ట్‌వేర్ ముసుగులో TDR మాయాజాలం.. పారదర్శకతకు పాతర!
- టౌన్ ప్లానింగ్ అధికారుల 'డిజిటల్' దందా.. ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల గండి.
- కోర్టులకు దొరకని 'ఏఐ' నేరాలు.. దళారులదే రాజ్యం!



12లో

భారత శక్తి

# అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా

భారత్?అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు. భారత్?అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు. 2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ. అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం. రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో?రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొంటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది. ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది. ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్?డిసెంబర్ మధ్య 27% తగ్గుదల. నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి. డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది. ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం. స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు. రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.

# ఫ్యాన్‌లో జోష్ నింపిన తెలంగాణ రిజల్ట్స్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోంది. గులాబీ పార్టీ గట్టి పోటీ ఇచ్చినట్టు కనిపించినా తుది ఫలితాల్లో మాత్రం వెనుకబడింది. ఆ పార్టీ కేవలం నాలుగు మున్సిపాలిటీల్లో మాత్రమే సత్తా చాటింది. మిగతా చోట్ల కాంగ్రెస్ హవా నడుస్తోంది. ఒకటి రెండు చోట్ల బిజెపి ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన కలవరం మొదలైంది. ఒకటి అధికార పార్టీకి అనుకూలమైన ఫలితాలు. రెండు మిత్రుడైన కెసిఆర్ పార్టీ ఓడిపోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనకు కారణం అవుతుంది. ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో గులాబీ పార్టీకి ప్రతిపక్ష హోదా వచ్చింది. గౌరవప్రదమైన అసెంబ్లీ సీట్లు కూడా దక్కాయి. కానీ ఏపీలో మాత్రం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కేవలం 11చోట్ల మాత్రమే వైసిపి గెలుపొందింది. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. ప్రభుత్వం పట్ల సంతృప్తి శాతం కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు జరిగితే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన జగన్ మోహన్ రెడ్డి లో ఉంది. తెలంగాణలో గులాబీ పార్టీ నాయకులు బలంగా ఉన్నారు. కెసిఆర్ కు అటు కుమారుడు కేటీఆర్, ఇటు మేనల్లుడు హరీష్ రావు తో పాటు సీనియర్ నేతలంతా గట్టిగానే మద్దతుదారులుగా నిలుస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో గులాబీ పార్టీ నెగ్గుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతింది. కానీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం కొంతవరకు ప్రభావం చూపగలిగింది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాన్ని అడ్డుకోగలిగింది. కానీ ఆ పరిస్థితి ఏపీలో ఉంటుందా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలగా? కనీసం ఉనికి చాటుకోగలద? అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఏపీలో కూటమి బలంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో మున్సిపల్ ఎన్నికలను ఫేస్ చేయడం అంత ఈజీ కాదు. ఏ ఎన్నికలు జరిగినా ఇప్పుడు అధికార పార్టీగా టిడిపి కూటమి ఉంటుంది. అందులోనూ మూడు పార్టీల మధ్య గ్యాప్ చూడాలనుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ రోజురోజుకు వారి మధ్య మంచి బంధం ఏర్పడుతోంది. రాజకీయంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణి కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రాని పరిస్థితి. 2021 మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాలుగా దూకుడు ప్రదర్శించింది. చాలాచోట్ల ఏకగ్రీవాలను సైతం చేసుకుంది. ప్రస్తుతం బిజెపి సైతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అండ కూడా కూటమికి ఉంటుంది. పొరుగునే ఉన్న తెలంగాణలో అధికార పార్టీ హవా స్పష్టంగా కనిపించింది. అది ఏపీలో సైతం రిపీట్ అవుతుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సైతం ఇది తెలుసు. అందుకే ఆ పార్టీ నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారనుంది. మున్సిపల్ ఎన్నికలను ఆ పార్టీ ఫేస్ చేస్తుందా? లేదా? అనేది ఒక అనుమానం?

# మళ్లీ ముద్రగడతో రాజకీయం

కాకినాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతల్లో ఒక కొత్త వివాదం ప్రారంభం అయ్యింది. ముద్రగడ పద్మనాభం కు జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడంపై ఇప్పుడు ఆ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముద్రగడ రాజకీయ నిర్ణయాలు



బాగుండవని.. ఆయనను నమ్ముకొని రాజకీయాలు చేయడం అంత మంచిది కాదని వైసీపీ కాపు నేతలు చెబుతున్నారు. ఇటీవల అంబటి రాంబాబు ఎపిసోడ్లో ముద్రగడ పద్మనాభం లేఖ రాయడం పై కాపు నేతలు ఆగ్రహంగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కాపు నేతలకు అన్యాయం చేసిందంటూ చెబుతూ ఆయన రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. అయితే అది కూటమి ప్రభుత్వం కంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సెగలు రేపినట్లు వార్తలు వచ్చాయి. అనవసరంగా ముద్రగడ పద్మనాభం ను హైలెట్ చేయడం పగదని సొంత పార్టీ నేతలే జగన్మోహన్ రెడ్డి వైఖరిపై ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. గడిచిన ఎన్నికలకు ముందు ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా ఆయన జనసేనకు వెళ్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనతో మేలు కంటే కీడు అధికమని పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు సూచించినట్లు వార్తలు వచ్చాయి. అందుకే పవన్ కళ్యాణ్ సైతం వెనక్కి తగ్గారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ ను ఓడించడంతోపాటు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తానని శపథం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని కూడా సవాల్ చేశారు. అలా ఓడించకపోతే తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని ప్రకటన చేశారు. అయితే ఆయన మాటలను గోదావరి జిల్లాల్లో కాపు సామాజిక వర్గం అస్సలు పట్టించుకోలేదు. అయితే పవన్ కళ్యాణ్ విషయంలో ముద్రగడ రెచ్చగొట్టిన వ్యాఖ్యలే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులను దూరం చేశాయని ఆ సామాజిక వర్గ నేతలు భావించారు. ఆ ఎన్నికల్లో దారుణ ఓటమి ఎదురైంది. కానీ ఇప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి ముద్రగడ పద్మనాభంను ముందు పెట్టి రాజకీయం చేయడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది. వాస్తవానికి ముద్రగడ పద్మనాభం 1989 లోనే చివరిసారిగా ఎమ్మెల్యేగా అయ్యారు. 1995లో ప్రత్తిపాడునియోజకవర్గంలో ఆయన ఓడిపోవడంతో తిరిగి ఆ నియోజకవర్గ వైపు చూడనని తేల్చి చెప్పారు. 2009లో పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి ఓటమి చవి చూసారు. తరచూ అభిప్రాయాలు మార్చుకోవడం, అన్ని పార్టీల నాయకత్వాలతో విభేదాలు ఏర్పడడం వంటివి ముద్రగడ పద్మనాభం కు మైనస్ గా మారాయి. ఆయన ద్వారా కాపులను ఆకర్షించాలన్న ప్రయత్నం సరి కాదన్నది వైసీపీ నేతల వాదన. తాజాగా అంబటి రాంబాబు ఎపిసోడ్లో ప్రభుత్వానికి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన హై కమాండ్ ఆదేశాలు లేనిదే లేఖ రాయరు. అటువంటిది వంగవీటి మోహన్ రంగా, ముద్రగడ పద్మనాభం, అంబటి రాంబాబు తదితరులను టిడిపి వేధించిందని లేఖ రాశారు ఘాటుగా. అయితే దీని ద్వారా లాభం కంటే నష్టమే అధికమని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులు మరింత దూరం జరుగుతారు అన్నది వారి భయం.

తగ్గేదెలా అంటున్న అంబటి

మాజీ మంత్రి అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అయితే అంబటి రాంబాబును అభినందించాల్సింది పోయి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఏదో ఆవేశంతో అన్న మాటలను ఆయన వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పారని.. అటువంటి వ్యక్తిని దండించడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి అంటూ మాట్లాడారు. అంబటి జైలుకు వెళ్లిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ కూడా.. రాజకీయ అనుభవం ఉన్న నేను ఎవరో రచ్చగొడితే.. హుందాగా ప్రవర్తించాల్సిన నేను ఆవేశంతో నోరు జారాను. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అలా మాట్లాడడం తప్పి అని అన్నారని చెప్పుకొచ్చారు.. దీంతో అంబటి రాంబాబు లో బ్రహ్మాండమైన మార్పు వచ్చిందని.. ఆయన పశ్చాత్తాప పడుతున్నారని అంతా భావించారు. కానీ నిన్న మళ్ళీ రిమాండ్ కు తరలించే క్రమంలో అంబటి రాంబాబు హావభావాలు చూస్తే ఒక నిర్ణయానికి రావచ్చు. ఆయన పశ్చాత్తాప పడే రకం కాదని కూడా తేలిపోయింది. అంబటి రాంబాబు అయినా.. ఇంకొకరు అయినా వైసీపీలో ఒక స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడతారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించి కామెంట్స్ చేస్తారు. అక్కడ ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం వ్యక్తం చేసే వారికి చోటు ఉండదు. అలా ఆశించలేము కూడా. అటువంటిది అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారు అంటే ఏమనుకోవాలి. నిన్ననే గుంటూరు సివిల్ జడ్జ్ కోర్టుకి వ్యానులో తీసుకు వచ్చినప్పుడు అక్కడ తనకోసం ఎదురుచూస్తున్న అనుచరులు, మీడియా ప్రతినిధులను చూసి గడ్డం కింద నుంచి చెయ్యి తిప్పుతూ.. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ మాదిరిగా తగ్గేదేలే అని సైగ చేశారు. అది చూసి ఆయన అనుచరులు కూడా ఉత్సాహంగా రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. పార్టీ డిఎన్ఏ లోనే అది నిండిపోయింది. అటువంటప్పుడు అంబటి రాంబాబు పశ్చాత్తాప పడతారని.. పడ్డారని అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు అని అర్థమైంది. అరెస్టుకు ముందే అంబటి రాంబాబు చాలా రకాల వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు పై కామెంట్స్ చేసే క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నన్ను అరెస్టు చేసుకుంటారా చేసుకోండి. ఇక్కడే ఉన్నా. అరెస్టు చేస్తే బెయిల్ కూడా అడగను. ఎంత కాలమైనా జైల్లో ఉంటానని కూడా చెప్పేశారు. కానీ ఇప్పుడు ఆయన అనుకున్న మాదిరిగానే జైలు మీద జైలుకు తిరుగుతూనే ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆయన ముఖంలో పశ్చాత్తాపం కాదు కదా.. విపరీతమైన కోపం కనిపిస్తోంది.

# క్వింటాల్ మిరప రూ.87,786..

అనంతపురం, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

అనంతపురం జిల్లాలో ఓ మిరప రైతు పంట పండింది. వద్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే మిరప రైతు డబ్బీ డ్రై మిరపను పండించారు. ఈ మిరప పంటను కర్ణాటకలోని బ్యాడిగి



మార్కెట్ తరలించగా.. మార్కెట్లో గురువారం రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.87,786 పలికింది. దీంతో రైతును మార్కెట్ అధికారులు, వ్యాపారులు, తోటి రైతులు సన్మానించారు. పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. జిల్లాకు చెందిన ఓ మిరప రైతు పంట పండింది. రాయదుర్గం మండలంలోని వద్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే రైతు పండించిన మిరపకు రికార్డు ధర లభించింది. తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరప.. రికార్డు స్థాయిలో క్వింటాల్ ధర రూ.87,786 పలికింది. కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఉన్న బ్యాడిగి వ్యవసాయ మార్కెట్‌లో తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరపకాయలు .. ఈ రికార్డు ధర పలికాయి. దీంతో తోటి రైతులు, మార్కెట్ అధికారులు, వ్యాపారులు తిప్పేస్వామికి సన్మానం చేశారు. నాణ్యమైన మిరప పండించారంటూ పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. వద్రవన్నూరు రైతులు సుమారు 2 టన్నుల మిరపను బ్యాడిగి మార్కెట్‌కు తరలించారు. మంచి ధర పలకటంతో మిరప రైతులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు గత రెండేళ్లుగా మిరప రేట్లు చతికిలపడ్డాయి. ఇటీవల మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మిరప రైతులు సంతోషంలో ఉన్నారు. మిరపలో రకాన్ని అనుసరించి రెండేళ్లతో పోలిస్తే ఈ సారి నాణ్యత ప్రకారం ఒక్కో రకం మిరప రూ.7000 నుంచి రూ.8000 వరకూ పెరిగింది. దీంతో రైతులు ఆశగా ఉన్నారు. మిర్చి ధరలు నేలచూపులు చూడటంతో రెండు ఏళ్లుగా రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి మిరప సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపించలేదు. దీంతో ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. దీంతో మిరప పంట దిగుబడి మరింత తగ్గింది. దీంతో ఈసారి మిరపకు డిమాండ్ పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

డబ్బీ డ్రై మిరపకాయలకు ఎందుకింత డిమాండ్..

మరోవైపు డబ్బీ డ్రై మిరపకాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని కర్ణాటకలోని బ్యాతగిరి ప్రాంతంలో ఎక్కువగా పండిస్తారు. నాణ్యమైన, మంచి రంగును కలిగి ఉంటాయి. తక్కువ కారం, ఎక్కువ సువాసన ఉండటంతో డబ్బీ డ్రై మిరపకాయలకు డిమాండ్ ఎక్కువ. డబ్బీ డ్రై మిరపకాయల పొడిని సాంబార్, పచ్చళ్ల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వీటిలో కూడా ఏ, ఏప్లస్ గ్రేడ్ అనే రెండు రకాలు ఉంటాయి. సాంబార్, మసాలా పొడులు, చట్నీలలో ఎక్కువగా ఈ మిరపకాయల పొడిని ఉపయోగిస్తుంటారు. సాధారణ మిరపకాయలతో పోలిస్తే ముదురు ఎరుపు రంగంలో కాస్త లావుగా ఉండటంతో పాటుగా డబ్బా ఆకారంలో ఉండటంతో వీటికి ఆ పేరు వచ్చింది.

# మసాజ్ ముసుగులో వ్యభిచారం

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

మసాజ్ సెంటర్ ముసుగులో సాగుతున్న వ్యభిచార ముఠా గుట్టును కేపి.హెచ్ బి పోలీసులు రట్టు చేశారు. స్థానిక అసాన వెల్ నెస్ స్పా సెంటర్పై అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 మంది యువతులను రక్షించడంతో పాటు, నిర్వాహకులు, విటులు కలిపి మొత్తం 30 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసాన వెల్ నెస్ స్పాలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. మగవారికి ఆడవారితో క్రాస్ మసాజ్ చేస్తామంటూ యువతులను రప్పించి, వారి ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మసాజ్ సెంటర్ లోపల ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దాడుల్లో వెల్లడైంది.

# డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

తెలంగాణ ఫిబ్రవరి 15 : నల్గొండ జిల్లా చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ తయ్యూబ్ (30) మృతిచెందాడు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు ముగించుకుని స్వగ్రామం నకిరేకల్‌కు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తయ్యూబ్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందిన వెంటనే నల్లగొండ రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# మున్సిపల్ చైర్మన్ రేస్ లో ఆ నలుగురు

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15 (భారత శక్తి) :

ములుగు జిల్లాలో మొదటిసారి గా మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 16న జరగనున్న నేపథ్యంలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న నలుగురు బిసి మహిళలు పోటీలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. 8వ వార్డు నుండి గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని నల్లల స్వాతి,నాల్గవ వార్డు నుండి గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ గుంటూజు పావని నిరంజన చారి, మూడవ వార్డు నుండి గెలుపొందిన యాసం వసంత రవికుమార్, ఆరవ వార్డు నుండి గెలుపొందిన చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి, నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీ చైర్మన్ పదవి కోసం రాష్ట్ర మంత్రి స్థానిక శాసన సభ్యురాలు ధనసరి అనసూయ సీతక్క వద్ద

నలుగురు మహిళా కౌన్సిలర్లు తనకు చైర్మన్ పట్టాన్ని కట్టబెట్టాలని తమదైన రీతిలో విన్నపం చేసుకున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 12 మంది కౌన్సిలర్లు గెలు పొందగా, టిఆర్ఎస్ కు ఐదు స్థానాలు, స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు ,భాజపా నుండి ఒకరు గెలిచారు. మున్సిపల్ చైర్మన్ పదవి బిసి మహిళకు రిజర్వు కావడంతో బీసీ వర్గానికి చెందిన గుంటోజు పావని, చింత నిప్పుల చంద్రకళ, యాసం వసంత, నల్లెల్ల స్వాతి తమ తమ అభ్యర్థనను మంత్రి సీతక్క వద్ద ఉంచారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ నుండి గెలుపొందిన 12 మంది కౌన్సిలర్లను రాజధాని కి తీసుకువెళ్లి క్యాంపులో ఉంచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నలుగురి మహిళా కౌన్సిలర్లలో ములుగు మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి తనయుడు భరత్ కుమార్ తన సతీమణి స్వాతిని ఎన్నికల రంగంలోకి దింపి గెలుపొందగా మంత్రి సీతక్క కు 2018 అసెంబ్లీ ఎన్నికలలో కీలక పాత్ర పోషించిన నల్లెల్ల కుమారస్వామి 2021లో కాలం చెల్లారు. ములుగు నియోజకవర్గంలో సీనియర్ వృద్ధ కాంగ్రెస్ నేతలలో ఒకరైన ఫ్రీడమ్ ఫైటర్ గుంటోజు నరసయ్య తనయుడు శంకర్ కుమారుని సతీమణి గుంటోజు పావని కాంగ్రెస్ పార్టీలో వృద్ధ కాంగ్రెస్ నాయకుడు గుంటోజు నరసయ్య ( దివంగతుడు) రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పావని కి మున్సిపల్ కుర్చీని కేటాయించాలని వారి కుటుంబ సభ్యులు మంత్రి సీతక్క వద్ద విన్నవించుకున్నట్లు సమాచారం.

మంత్రి సీతక్క 2004లో తెలుగుదేశం పార్టీ తరఫున రాజకీయ అరంగేట్రం చేసి పోటీ చేసినప్పటి నుండి నేటివరకు ఆమె వెన్నంటి ఉన్న సీనియర్ నాయకులు యాసం వసంత రవికుమార్ యాదవ సామాజిక వర్గం నుండి తన సతీమణి కి మున్సిపల్ చైర్మన్ పదవిని కట్టబెట్టాలని విన్నవించుకున్నట్లు సమాచారం. సీతక్కకు విధేయుడుగా అత్యంత విశ్వాసం గల నాయకుడిగా 2004 నుండి అసెంబ్లీ ఎన్నికల కాలంలో అంతరంగిక కార్యదర్శిగా ఉన్నాడు కాగా ఇప్పుడు బీసీ మహిళలకు అవకాశం రావడంతో తన సతీమణి చింతనిప్పుల చంద్రకళకు చైర్మన్ పదవిని కట్టబెట్టాలంటూ బిక్షపతి మంత్రిని వేడుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ఈ నలుగురి మహిళా కౌన్సిలర్లలో చైర్మన్ పదవి ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందోననే ఉత్కంఠ నెలకొన్నది. సోమవారం రోజున జరిగే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఎవరిని వరిస్తుందోనని ములుగు జిల్లా నాయకులు, పార్టీ అభిమానులు ఎదురుచూస్తున్నారు.










# మహిమాన్విత శివాలయం కనికెల గుండం

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాశినాయన మండలంలోని రంపాడు పంచాయితీలో సగిలేరు ఒడ్డున వెలసివున్న కనికెల గుండం పరమేశ్వరస్వామి మహోత్సవాన్ని వరదగొల్ల గురయ్య తన మిత్రులు, గ్రామ పెద్దలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే మహిళలు, పిల్లలు, పురుషులు స్వామివారి దర్శనభాగ్యం కోసం క్యూ కట్టడం జరిగింది. వచ్చిన భక్తులందరికీ ఉదయం అల్పాహారంతో బాటు, మధ్యాహ్నం భోజన వసతులు కూడా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కనికెల గుండం పరమేశ్వరస్వామి 250 సంవత్సరాల నాటి పురాతన దక్షణ ద్వారం కల్గిన మహిమాన్విత శివాలయం అని, ఈ స్వామిని దర్శించుకుంటే కాశీ విశ్వేశ్వరుని దర్శించుకున్నట్లే అని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలాంటి దక్షణ ద్వారం కల్గివున్న శివాలయాలు భారతదేశంలో మూడే వున్నాయని ఒకటి కాశి, రెండవది గద్వాల్ జోగులాంబ దేవాలయం, మూడవది ఈ కనికెల గుండం పరమేశ్వరస్వామి స్వామి ఆలయం అన్నారు.ఈ దేవాలయ ప్రాంతంలో వున్న సగిలేరు ఒడ్డున అక్కదేవతలు అలంకరణలు చేసుకొనే వారని పూర్వంనుంచి ప్రతీతి. పది సంవత్సరాల నుండి ప్రతి మహాశివరాత్రికి, కార్తీక పౌర్ణమికి స్వామివారి మహోత్సవ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కార్యకర్త వరదగొల్ల గురయ్య చెబుతున్నారు. ఇంతటి మహిమాన్వితమైన శివాలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఇక్కడకు వచ్చేందుకు సరియైన దారికూడా లేదని అంటున్నారు. ఓబులాపురం గ్రామం గుండా ఇక్కడకు వచ్చేందుకు అవసరమైన దారిని ఇచ్చేందుకు రైతులు కూడా సిద్ధంగా వున్నారని ప్రభుత్వం కూడా సహకరించాలని కోరుతున్నారు. దాతల సహకారంతో వరదగొల్ల గురయ్య, ఆలయ ధర్మకర్త వరదగొల్ల చిన్న గురయ్య, సిద్దమూర్తి జయరామిరెడ్డి, సిద్ధమూర్తి దిగురెడ్డి, కల్లూరి శ్రీనివాసులు, కల్లూరు గోపాలరెడ్డి, పాలకొండు శ్రీరామ్ రెడ్డి,కావూరి పార్థసారధి నాయుడు, బాలుడు, దీపక్ నాయుడు తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చక్కటి వసతులను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# శ్రీనివాస్ సేవలు అభినందనీయం : అదనపు కలెక్టర్ మహేందర్ జీ

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15 (భారత శక్తి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని రామప్ప దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం కీ:శే: గంగిశెట్టి సరస్వతి జ్ఞాపకార్థం వారి కుమారుడు గంగిశెట్టి శ్రీనివాస్ దాతగా ఉచిత శుద్ధి చేయబడిన త్రాగునీటి కేంద్రాన్ని ములుగు అదనపు కలెక్టర్ మహేందర్ జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాలుగా రామప్పలో ఉచిత త్రాగునీరు అందించడం గొప్ప విషయమని మహేందర్ జీ అభినందించారు. కార్యక్రమంలో వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు, రామప్ప ఆలయ కమిటీ చైర్మన్ మిల్కూరి ఐలయ్య, ఈ.ఓ శ్రీనివాస్, రామప్ప ఆలయ కమిటీ సభ్యులు,గొల్లపల్లి రాజేందర్ గౌడ్,పిట్టల మధు,కోటి ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు డి.బలరాం రెడ్డి, ఎస్. రవీందర్ రెడ్డి, పి. నాగరాజు, సి హెచ్. రమేష్, ఏ. రాజు,ఎం రమేష్, ఎస్ రవీందర్, సోమనర్సయ్య,ఎన్. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.









# కొరియన్ లవ్ గేమ్... ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్

న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్




ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ..ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు. ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు.“నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా” ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు.టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచంలోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను నూరిపోస్తుంటారు.ఆ తర్వాత వారిని తమ ఆధీనంలోకి పూర్తిగా తీసుకున్న తర్వాత.. ఈ ప్రపంచం తో నీకు సంబంధం లేదు.. నువ్వింక వెళ్ళిపోవచ్చు.. ఈ టాస్క్ లో కనుక నువ్వు చనిపోతే విజేతవు.. అంటూ ఒక రకమైన ఉద్వేగాన్ని రుద్దుతారు. ఫలితంగా ఇదంతా నిజమే అని భ్రమపడి పిల్లలు.. కొరియన్ గేమ్స్ నిర్వాహకులు చెప్పినట్టుగా చేస్తుంటారు. చివరికి వారు తన ప్రాణాలను కూడా కోల్పోతుంటారఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నగరంలో జరిగింది పైతరహా దారుణమే. అయితే ఇప్పటికీ ఈ విషయంలో ఇంకా కొన్ని తెలియని నిజాలు బయటికి రావాల్సి ఉంది. ఈ ఘటనలో ఆ ముగ్గురు పిల్లల తండ్రి చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. ఇంకా దర్యాప్తు సాగుతుంది కాబట్టి ఈ వ్యవహారంలో కొన్ని విషయాలను బయటకు చెప్పడం సాధ్యం కావడం లేదు.ఘజియాబాద్ ఘటన తర్వాత కొరియన్ గేమ్స్ పై చర్చ మొదలైంది. ముఖ్యంగా బ్లూ వేల్ గేమ్ ను బ్యాన్ చేయాలని డిమాండ్ కూడా వ్యక్తం అవుతుంది. వేల్స్ లో బ్లూ వేల్స్ కొన్ని సందర్భాలలో ఒంటరిగా ఉంటాయి. ఆ తర్వాత ఎవరికి చెప్పకుండా తమను తాము బలవంతంగా చంపేసుకుంటాయి. కొరియన్ గేమ్ నిర్వాహకులు కూడా తమ రూపొందించిన ఆటకు బ్లూవేల్ గేమ్ అని పేరు పెట్టారు. అందులో బ్లూ వేల్ మాదిరిగానే చనిపోవాలని టాస్క్ ఇస్తుంటారు.. ఇది పిల్లల మెదడు పైన ఒక రకమైన ప్రభావాన్ని చూపుతుంది. తమకు తెలియకుండా తామే ఆత్మహత్య చేసుకునే విధంగా పురిగొల్పుతుంది.ఘజియాబాద్ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో దాదాపు 800 మంది దాకా యువతీ యువకులు మిస్సింగ్ అయ్యారని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో దేశవ్యాప్తంగా కలకలం నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఘజియాబాద్ ఘటన విషయంలో ఉత్తర ప్రదేశ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. ఢిల్లీలో 800 మంది యువతీ యువకులు మిస్సింగ్ అవ్వలేదని.. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిలోకి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనప్పటికీ తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలు ఫోన్లలో ఏం చేస్తున్నారో..ఏం చూస్తున్నారో కనిపెట్టుకొని ఉండాలి.

# కోమటిరెడ్డి ధైర్యం ఏంటీ...

నల్గొండ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలనే సాధించింది. ఈ విజయంతో సంబరాల ఊపులో ఉన్న టైంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని లేకుంటే డైరెక్ట్‌గా సీఎం కుర్చీనే టార్గెట్ లాక్కుంటానని హెచ్చరించారు. ఇప్పుడే కాదు ఆయన గతంలో కూడా ఇలాంటి కామెంట్స్ చాలా చేశారు. తనను పార్టీలోకి తిరిగి తీసుకున్నప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారని ఇప్పుడు అది కావాలంటూ చాలా కాలం నుంచి పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా ఆయన్ని ఎవరూ పిలిచి మాట్లాడటం లేదు. ఆయన కామెంట్స్ ఆగటం లేదు. ఇప్పుడు మరోసారి కామెంట్స్‌తో వార్తలకెక్కారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. అయితే ప్రతిపక్షంలో ఉన్న టైంలో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత అక్కడి నుంచి 2023 ఎన్నికల టైంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పదవి హామీతోనే పార్టీలోకి తీసుకొచ్చినట్టు ఆయన చెప్పుకుంటున్నారు. ఆయన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడం సాధ్యం కాదు. అయినా నాకు మంత్రి పదవి కావాల్సిందేనంటూ మొండికేస్తున్నారు. మంత్రి పదవి ఎలాగైనా సాధించుకోవాలని సమయం వచ్చినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బాణాలు సంధిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలిచి మాట్లాడింది. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. అందుకే రోజు రోజుకు ఆయన విమర్శల డోసు పెరుగుతూనే ఉంది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావించారు. పార్టీలోకి తీసుకొని వచ్చినప్పుడు తనకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రిపదవి ఇవ్వాలని రాజగోపాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే డైరెక్ట్‌గా సీఎం అవుతానంటూ హెచ్చరించారు. ఇకపై పదవి కావాలని అడుక్కోవడం ఉండదని నేరుగా సమయం వచ్చినప్పుడు సీఎం సీట్లో కూర్చోవడమే ఉంటుందని హెచ్చరించారు. కచ్చితంగా తనకు మంచి పదవి వస్తుందని కూడా నమ్మకం వ్యక్తం చేశారు. ఇలా మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున ఇలాంటి అసంతృప్తి స్వరం వినిపించడంపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కూడా సీరియస్‌గా ఉంటోంది. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటాను అంటూ గతంలో రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై కూడా ఇలానే రాజగోపాల్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఇది కాంగ్రెస్ రూల్స్‌కు విరుద్ధమని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ఉన్నాయని ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. గత ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణ టైంలో కూడా విమర్శలు చేశారు.



ఆస్తులు అమ్మి పార్టీని గెలిపిస్తే తనను మోసం చేశారని మండిపడ్డారు. తనతోపాటు వచ్చిన వారికి మంత్రిపదవులు ఇచ్చారని తనను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే రాజగోపాల్ రెడ్డికి పడటం లేదు. ఆయన వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన వ్యక్తిని నేరుగా సీఎం సీటులో కూర్చోబెట్టడాన్ని తప్పుపడుతున్నారు. అందుకే సమయం వచ్చినప్పుడల్లా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటుంది రేవంతే అనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. అధిష్ఠానం వద్ద ఏదో ఒకటి చెప్పి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నారు. అందుకే సందర్భం ఏదైనా సరే రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే నీ కుర్చీ లాక్కుంటా అంటూ రేవంత్ రెడ్డికే పరోక్షంగా సవాల్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఓవైపు రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జీవన్ రెడ్డి, ఇంకో వైపు జగ్గారెడ్డి లాంటి వాళ్లతో సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి విమర్శలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయని రాష్ట్ర నాయకత్వం ఎన్ని రకాలుగా చెబుతున్నా వీళ్లు మాత్రం తమ పంథం వీడటం లేదు. సోదరుడు వెంకట్‌రెడ్డి కేబినెట్‌లో ఉండగానే రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా లభిస్తుందని పార్టీలోని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ పిల్లాడి మాదిరిగా మారం చేస్తున్నారని అంటున్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రతులకు ప్రత్యేక పూజలు


విజయవాడ భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, నేడు ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ వారి పాదాల చెంత బడ్జెట్ ప్రతులను ఉంచి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీయూష్ కుమార్ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ, డి. రోనాల్డ్ రోస్ కార్యదర్శి, ఆర్థిక శాఖ, సూరజ్ గనోరే, గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన అధికారులకు ఆలయ ఈవో శీనా నాయక్ ఘనస్వాగతం పలికి, వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అర్చకులు బడ్జెట్ ప్రతులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం అధికారులకు తీర్థప్రసాదాలు అందజేశారు.దర్శనం అనంతరం అధికారులకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ నిర్విఘ్నంగా అమలు కావాలని అధికారులు ఈ సందర్భంగా ప్రార్థించారు.

# వైసీపీకి పెద్దన్నయ్య పాత్ర ఎవరిది...

నెల్లూరుభారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

సింహం సింగిల్.. మాది ఎప్పుడు ఒంటరి పోరాటమే. కాంగ్రెస్ పార్టీ నే లెక్క చేయలేదు.. సోనియా గాంధీనే ఖాతరు చేయలేదు.. ఇలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రకటన లేదు. పెద్ద పెద్ద డైలాగులు ఆ పార్టీ శ్రేణులకు వెన్నతో పెట్టిన విద్య. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయాణాన్ని గమనిస్తే ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. ఒక బలమైన ప్రాంతీయ పార్టీగా చెప్పుకుంటూనే.. కష్టం వస్తే బిజెపి సాయం తీసుకోవడం.. అదే బిజెపికి జాతీయస్థాయిలో మద్దతు తెలపడం ఇట్టే అర్థమవుతుంది. అయితే ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు. వ్యక్తిగత కేసులతో పాటు రాజకీయ ప్రయోజనం కోసమే. అయితే ఇప్పుడు కూడా బిజెపి తమను కాపాడుతోందని బిల్డప్ ఇస్తున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు.తాజాగా టీటీడీ లడ్డు వివాదానికి సంబంధించిన అంశాలతో రాజకీయ ప్రకంపనలు రేగుతున్నాయి ఆంధ్ర ప్రదేశ్ లో. ఇప్పుడు కూడా బిజెపి తమ వెనుక ఉందని ప్రచారం చేసుకుంటున్నాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. అయితే జగన్మోహన్ రెడ్డి పై ఉన్న పాత కేసులు, వివేకా హత్య నుంచి మొదలుకొని తాజా స్కామ్ ల వరకు దర్యాప్తు చూస్తే ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు ఉంది. తమ వెనుక బిజెపి ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు అంటే రాజీ పడినట్టే కదా. అయితే బలమైన ప్రాంతీయ పార్టీ అని చెప్పుకునే వైయస్సార్ కాంగ్రెస్ లేనిపోని ప్రగల్భాలు పలకడం ఏమిటంటే.. పోనీ ఏదో రాష్ట్ర ప్రయోజనాల కోసం చేస్తున్నారు అంటే అది కాదు. కేవలం జైలు శిక్షలతో పాటు కేసుల కోసమే అన్నది బహిరంగ రహస్యం. విశ్వసనీయత అనే పెద్ద మాటలు వాడితే ఆ పార్టీకే నష్టం.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కాపాడాల్సిన అవసరం భారతీయ జనతా పార్టీకి లేదు. ఎందుకంటే సిద్ధాంత పరంగా కూడా ఆ రెండు పార్టీల భావజాలం వ్యతిరేకమే. ఎందుకంటే దళితులతో పాటు మైనారిటీ ఓటు బ్యాంకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉంటుంది. ఆ రెండు వర్గాలు భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమే. రెండు



పార్టీల మధ్య పొత్తు కుదిరే పని కాదు. గెలిచిన తర్వాత చట్టసభల్లో కేవలం మద్దతు మాత్రమే తెలుపుకోగలరు. అయితే ఏపీలో కూటమిలో ఉన్న బిజెపి మిగతా రెండు పార్టీలతో పోల్చుకుంటే తమను టార్గెట్ చేయడం లేదన్నది వైసీపీ మాట. అయితే ఏపీలో ఎలాగు పొత్తులో భాగంగా సీట్లతో పాటు ఓట్లు పెంచుకుంటుంది బిజెపి. కానీ వైసిపి చేస్తున్న ప్రచారానికి చెక్ చెప్పకుంటే మాత్రం బిజెపికే నష్టం. ఇప్పటికే వైసిపి తప్పులను ఎత్తిచూపుతోంది నేషనల్ మీడియా. మరోవైపు బిజెపి హిందుత్వవాదంతో బలంగా ముందుకు వెళుతుండగా.. ఆ వాదానికి తూట్లు పొడిచేలా వైసిపి ఏపీలో వ్యవహరించిందన్నది ప్రధాన ఆరోపణ. అటువంటి పార్టీతో అంటగాకడం నష్టమే. అయితే బిజెపిలో ఎటువంటి లోపం లేకపోయినా.. వైసిపి మాత్రం బిజెపి నీడలో ఉండాలని ప్రచారం చేసుకోవడం మాత్రం కాషాయ దళానికి నష్టం. తెలుసుకోకుంటే ఆ పార్టీకి ముప్పు.

# సూర్యప్రభవాహనంపై శ్రీ సూర్యనారాయణస్వామి అభయం

## – పరవశించిన భక్త జనం
## – ఫిబ్రవరి 15న రథోత్సవం

శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం 8 గంటలకు ఆదిత్య మండలం సూర్యప్రభ వాహనంపై ఖడ్గం, గద, విల్లు ధరించి శ్రీ సూర్యరాయణస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆయురారోగ్యప్రాప్తి :

సూర్యుడు సకల రోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్య మండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

వాహన సేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15న రథోత్సవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన ఆదివారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 7.45 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# అధికార పార్టీకి గౌరవం.. ప్రతిపక్షాలకు సముచితం

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

సరిగ్గా తెలంగాణ రాష్ట్రంలో ఒక ఐదు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో పెత్తనం మొత్తం కేటీఆర్ ది కాబట్టి.. అడ్డగోలుగా నిబంధనలు మొత్తం మార్చేశాడు. తన పార్టీ మాత్రమే గెలిచే విధంగా విధానాలు రూపొందించాడు. సీన్ కట్ చేస్తే సింహ భాగం మున్సిపాలిటీలలో గులాబీ పార్టీ గెలిచింది. ప్రతిపక్ష కాంగ్రెస్ గెలిచిన చోట కూడా బీఆర్ఎస్ ఆర్థిక బలంతో తొక్కి పారేసింది. క్యాంపు రాజకీయాలు స్టార్ట్ చేసింది.. కొంతమంది అభ్యర్థులను ఏకంగా అపహరించింది. ఇదే ప్రజాస్వామ్యం అంటూ కొత్త సూత్రీకరణకు దిగింది.ఇప్పుడు రేవంత్ పరిపాలన లోకి వద్దాం. ఇదేదో రేవంత్ గురించి భజన చేసే కార్యక్రమం కాదు. ఆయన పరిపాలనకు చిడతలు వాయించే వ్యవహారం అంతకంటే కాదు. బాధ్యత గల మీడియా సంస్థగా మా దృష్టికి వచ్చిన అంశాలను మా వీక్షకులకు అందించడం కోసమే ఈ కథనం పబ్లిష్ చేస్తున్నాం.తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా తేడా ఉంటుంది. తెలంగాణలో సామాజికంగా.. రాజకీయంగా.. ఇతర వ్యవహారాలలో ప్రజలలో చైతన్యం విపరీతంగా ఉంటుంది. నచ్చిన వాళ్లను తెలంగాణ ప్రజలు నెత్తి మీద పెట్టుకుంటారు. అదే నచ్చని వాళ్ళని అయితే నేలకేసి కొడతారు. ఇందులో ఈ పార్టీ.. ఆ పార్టీ అని తేడా లేదు. అన్నిటికీ ఒకే విధమైన ట్రీట్మెంట్ ఇస్తారు తెలంగాణ ప్రజలు.సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం ఏకపక్షంగా మున్సిపల్ ఫలితాలను సాధించిన గులాబీ పార్టీ.. ఈసారి జరిగిన ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను సాధించింది. కానీ ఇక్కడే కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీకి అసలు సిసలైన ప్రజాస్వామ్య విలువలను బోధించింది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దర్పాన్ని పెద్దగా వినియోగించలేదు. గులాబీ పార్టీ మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించలేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వయంగా మీకు మంచి చేసే వాడిని ఎన్నుకోవాలని సూచించారు. మీకు కష్టాలు వస్తే ఆదుకునే వ్యక్తికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఆ సూత్రాన్నే తెలంగాణ ప్రజలు ఆచరించారు.అందువల్లే అధికార పార్టీకి గొప్పగా చెప్పుకునే స్థానాలు వచ్చాయి. ప్రతిపక్షాలకు గౌరవప్రదమైన స్థానాలు లభించాయి. ఎవరిని కూడా తక్కువ చూపు చూడలేదు తెలంగాణ ఓటర్లు. బిజెపికి బలం ఇచ్చారు. గులాబీ పార్టీకి పునర్జన్మ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీకి అండదండగా నిలిచారు. ఆమధ్య మహా రాష్ట్ర లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. దాదాపు క్లీన్ స్వీప్ చేసేసింది. ఈ విజయాన్ని అక్కడి అధికార పార్టీ గొప్పగా చెప్పుకుంది.ఇక కేరళ రాష్ట్రంలో కూడా జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్ తగిలింది. చాలావరకు స్థానాలలో అక్కడి ప్రతిపక్షం విజయం సాధించింది. కొన్ని ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు సత్తా చూపించారు.ఈ రెండు ఉదాహరణలు చాలు స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో చెప్పడానికి. ప్రజలు అయితేనేమో అధికార పక్షానికి లేకుంటేనేమో ప్రతిపక్షానికి ఓట్లు వేస్తున్నారు. తమ ఆగ్రహాన్ని ఏకపక్షమైన తీర్పుగా బ్యాలెట్ బాక్స్ లో వేస్తున్నారు.కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రజలు ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. దీనికి ప్రభుత్వం కూడా తోడు కావడంతో పరిస్థితి చాలా వరకు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఉదాహరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షమైన ఫలితాలు రాలేదు. అలాగని భారత రాష్ట్ర సమితి దారుణంగా ఓడిపోలేదు. చివరికి భారతీయ జనతా పార్టీ కూడా ఇక్కడ సత్తా చూపించ గలిగింది. కేవలం ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రమే కాదు.. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా కూడా పరిస్థితి ఇలానే ఉంది.ఏ జిల్లాలో కూడా ఏకపక్షమైన ఫలితాలు అధికార పార్టీకి రాలేదు. అలాగని ప్రతిపక్షానికి ప్రజలు గంప గుత్తగా జై కొట్టలేదు. అధికార పక్షాన్ని గౌరవించారు. ప్రతిపక్షాన్ని భుజం తట్టి నిలబెట్టారు. ఎక్కడ కూడా ఏకపక్షమైన ఫలితాన్ని ఓటర్లు అందించలేదు. అలాగని ప్రతిపక్షాలను చిన్నచూపు చూడలేదు?తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ప్రజలు ఎవరిని కూడా భుజాల మీదకి ఎత్తుకొని మోయలేరు. అలాగని కింద కూడా పడేయలేరు. సాధ్యమైనంత వరకు సముచితమైన స్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. అనేక ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు దీనిని నిరూపించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా బలంగా చాటారు. కేరళ రాష్ట్రంలో అత్యధికంగా అక్షరాస్యత ఉంటుంది. మహారాష్ట్రలో ప్రజలకు ఆర్థిక స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ రెండు రాష్ట్రాల ప్రజలను మించి తెలంగాణ ప్రజలు వ్యవహరించారు. తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు.ఫలితంగా తెలంగాణ అంటేనే విభిన్న తత్వమని మరోసారి నిరూపించారు. 2023 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి భారీగా మెజారిటీ ఇవ్వలేదు. అలాగని గులాబీ పార్టీని తక్కువ చూపు చూడలేదు. ప్రతిపక్షాన్ని గౌరవంగా ఉంచుకుంటూనే.. మార్పు కావాలని కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. తెలంగాణ ప్రభుత్వం.. తెలంగాణ ప్రజలు వ్యవహరించిన తీరు వల్ల ప్రజాస్వామ్యం గొప్పగా వర్ధిల్లింది. “ఈసారి ఎన్నికలు బాగా జరిగాయి. చాలా స్థానాలలో హంగ్ ఏర్పడింది. ఈ ప్రకారం ఎన్నికల ప్రక్రియ ఎంత గొప్పగా జరిగిందో అర్థం చేసుకోవచ్చని” రాజకీయ విశ్లేషకులు అంటున్నారు..

# రేవంత్ సత్తా చూపించిన ఎలక్షన్స్

వరంగల్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

మనం ఇంట్లో అన్నం తింటున్నప్పుడు.. స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతాం. ఎక్కడో ఒకచోట కూర్చుని ఆహారాన్ని లాగించేస్తూ ఉంటాం. అలాకాకుండా హోటల్లో తింటే ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తూ ఉంటాం. ప్రాంతం మారినప్పుడు.. తినే ఆహారం మారినప్పుడు ఆటోమేటిక్ గా మన వ్యవహార శైలిలో మార్పు వచ్చేస్తూ ఉంటుంది.పై ఉపోద్ఘాతం రాజకీయాలకు కచ్చితంగా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రాంతీయ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడు స్వేచ్ఛగా పనిచేసుకోగలుగుతాడు మంచి అనేది ఏదైనా జరిగితే తన ఖాతాలో వేసుకోగలుగుతాడు. నిర్ణయాలు తీసుకునే విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉంటాడు. తనే హై కమాండ్ కాబట్టి ఇంకొకరికి సమాధానం చెప్పకుండా.. అసలు సమాధానమే చెప్పాల్సిన అవసరం లేకుండా వ్యవహరిస్తూ ఉంటాడు.కానీ ఒక జాతీయ పార్టీలో పనిచేసే వ్యక్తికి ఇలా ఉండదు. అతడు ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలి. తీసుకునే నిర్ణయాన్ని ముందుగానే వెల్లడించాలి. పార్టీకి ఇబ్బంది రాకుండా.. ప్రభుత్వానికి ఒత్తిడి ఎదురుకాకుండా చూసుకోవాలి. ప్రతికూలతలు ఎదురైనప్పుడు సమయమనం తో.. సానుకూలతలు వచ్చినప్పుడు ఆశావాహ దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుంది.తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు సాధించింది. ఏకపక్షమైన విజయాలు కాకుండా.. గట్టి పోటీ ఎదుర్కొని మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. ఇదే సమయంలో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో స్థానాలను దక్కించుకున్నాయి.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి ఫలితాలు అంతగా ఏకపక్షంగా లేవు. అదే ఒకవేళ ప్రాంతీయ పార్టీకి గనుక రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తే ఫలితాలు మొత్తం ఏకపక్షంగా ఉండేది. క్షేత్రస్థాయిలో అనేక ప్రతికూలతలను అధిగమించి 2023లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాడు రేవంత్ రెడ్డి. ఎన్నికల సభల్లో కూడా అన్ని తానై నడిచాడు. ఇప్పుడు ఫలితాల విషయం కూడా రేవంత్ రెడ్డి అనేక ప్రతికూలతలను అధిగమించాడు. తనను తాను మరోసారి నిరూపించుకున్నాడు. ఒకవేళ రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ లేదా కేటీఆర్ గనక ఉండి ఉంటే ఫలితాలు ఏకపక్షంగా ఉండేవి. పైగా ఎన్నికల విషయంలో గులాబీ పార్టీ అడ్డగోలుగా వ్యవహరించేది. సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో పైసీన్ రిపీట్ అయింది. కాకపోతే ఈసారి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛాయుత విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికార పక్షానికి గౌరవం.. ప్రతిపక్షానికి తోడ్పాటు ప్రజల నుంచి లభించాయి. ఇదిగో ఇక్కడే రేవంత్ రెడ్డి గెలిచాడని.. అసలు సిసలైన నాయకుడిగా ఆవిర్భవించాడని కాంగ్రెస్ నాయకులు



అంటున్నారు.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించడానికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి దూకుడు. రేవంత్ రెడ్డి దాదాపుగా అన్ని జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలవాల్సిన అనివార్యతను వెల్లడించారు. తద్వారా తెలంగాణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీ వైపు దృష్టి సారించే విధంగా చేశారు.రేవంత్ రెడ్డి పాచిక వల్ల కాంగ్రెస్ పార్టీ భారీగా స్థానాలను సాధించినప్పటికీ.. ఒక మున్సిపాలిటీ విషయంలో మాత్రం రేవంత్ రెడ్డి స్థాయి సరిపోలేదు. ఆ మున్సిపాలిటీ పేరు సిరిసిల్ల. భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. చివరి వరకు అన్ని రకాలుగా వ్యూహాలు అమలు చేశారు. ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించారు.సిరిసిల్ల ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకి కాకుండా.. గులాబీ పార్టీకి జై కొట్టారు. ఇక్కడ 39 వార్డులకు 27 వార్డులను బిఆర్ఎస్ పార్టీ సొంతం చేసుకుంది. ఆరువార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఐదు వార్డులలో బిజెపి గెలుపును సాధించింది. ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. తద్వారా రేవంత్ రెడ్డి పాచికలు కేటీఆర్ ముందు పారలేదు. వాస్తవానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడానికి అనేక రకాలుగా ప్రయత్నం చేసింది. ఎన్నికలకు ముందే ఇక్కడ భారీగా అభివృద్ధి పనులు చేసింది. కాంగ్రెస్ పార్టీలోకి వలసలను కూడా ఆహ్వానించింది. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.

# తెలంగాణలో మొదలైన అసలైన రాజకీయం

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు వింత పరిస్థితిని తెచ్చిపెట్టాయి. మెజారిటీ చోట్ల కాంగ్రెస్ జెండా ఎగిరినప్పటికీ, సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ‘హంగ్’ ఏర్పడింది. ఇప్పుడు ఈ మున్సిపాలిటీల్లో పీఠాన్ని దక్కించుకోవాలంటే స్వతంత్ర అభ్యర్థుల మద్దతు అనివార్యంగా మారింది.సాధారణంగా గెలిచిన స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడానికి పార్టీలు భారీ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఈసారి సీన్ రివర్స్ అయ్యింది. “మద్దతు కావాలంటే మాకే ఛైర్మన్ పదవి ఇవ్వాలి” అంటూ స్వతంత్రులు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన సీనియర్లను కాదని, బయటి వ్యక్తికి ఛైర్మన్ పదవి ఎలా ఇవ్వాలో తెలియక కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

క్యాంపు రాజకీయాలు:

అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు పార్టీలు ఇప్పటికే ‘క్యాంపు’ రాజకీయాలకు తెరలేపాయి. గెలిచిన వారిని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు.అలియాబాద్ (మేడ్చల్ జిల్లా): ఇక్కడ 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7 స్థానాలు సాధించాయి. ఒక్క సీటు గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి గాదె వెంకటేష్ ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారారు. ఛైర్మన్ పదవి ఇచ్చే పార్టీకే నా మద్దతు అని ఆయన తేల్చి చెప్పారు.జనగామ: ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ బలబలాలు సమానంగా ఉండటంతో, స్వతంత్ర అభ్యర్థి పాండు కోసం రెండు పార్టీల నేతలు బాహాబాహీకి దిగారు. తనను ఛైర్మన్ చేస్తామంటేనే వస్తానని ఆయన షరతు విధించడం విశేషం.ఒకవేళ భారీ ఆఫర్లు ఇచ్చి స్వతంత్రులకు ఛైర్మన్ పదవి కట్టబెట్టినా, వారు తర్వాత వేరే పార్టీలోకి జంప్ అయితే పరిస్థితి ఏంటన్నది పార్టీల ఆందోళన. ప్రస్తుతం ఈ ‘హంగ్’ మున్సిపాలిటీల్లో గెలిచిన అభ్యర్థులకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో, రాజకీయ సమీకరణాలు గంటగంటకూ మారుతున్నాయి. మరో వైపు కేవలం గద్వాల మాత్రమే కాకుండా వర్ధన్నపేట, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పోలీసులతో బెదిరించి బలవంతంగా తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ వేధింపులు ఉన్నప్పటికీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 16 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీతో నేరుగా పీఠాలను కైవసం చేసుకుంటోందని వెల్లడించారు.మరో 10 నుంచి 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ‘లార్జెస్ట్ పార్టీ’ (అత్యధిక సీట్లు సాధించిన పార్టీ)గా అవతరించిందని తెలిపారు.భయంతోనే కాంగ్రెస్ అక్రమ మార్గాలను ఎంచుకుందని, తమ అభ్యర్థులను లాక్కునే ప్రయత్నాలను అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# ఖమ్మం... గుమ్మంలో టీడీపీ లెక్క

ఖమ్మం,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. స్థానికంగా బలం ఉన్నచోట సొంతంగానే ఆ పార్టీ నేతలు బరిలో దిగారు. అనూహ్యంగా ఖమ్మం జిల్లా మధిరలో టిడిపి అభ్యర్థి విజయం సాధించడం విశేషం. అయితే స్థానికంగా నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అక్కడ టిడిపి అభ్యర్థికి ప్రజలు పట్టం కట్టారు. అది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం. అటువంటి చోట టిడిపి అభ్యర్థి గెలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కానీ అక్కడ కాంగ్రెస్ మద్దతుతో టిడిపి గెలుపొందిందని కామెంట్స్ వినిపిస్తున్నాయి. వాస్తవానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి అధికారికంగా పోటీ చేయలేదు. ఫలితాల ప్రకటనలో మాత్రం టిడిపి అభ్యర్థి విజయం సాధించారని తెలియడం తో ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం జిల్లాలో టిడిపి హవా ఇంకా కొనసాగుతోందని స్పష్టమైంది. వాస్తవానికి తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే టిడిపికి బలం ఉండేది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు చోట్ల టిడిపి విజయం సాధించింది. అప్పట్లో మెజారిటీ స్థానాలు గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఖమ్మం జిల్లాలోనే వచ్చాయి..ఖమ్మం జిల్లాలో 2014 ఎన్నికల్లో సైతం మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2018 ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం సీన్ మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అసలు పోటీ చేయలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రబాబు ఎన్నో రకాల ప్రయత్నాలు చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ కు నాయకత్వ బాధ్యతలు కట్టబెట్టారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమరానికి శంఖం పూరించేందుకు ఖమ్మం జిల్లాను ఎంచుకున్నారు. ఆ జిల్లాలో తెలుగుదేశం పార్టీ భారీ సమావేశం కూడా నిర్వహించింది. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏపీలో చంద్రబాబు అరెస్టయ్యారు. ఆ సమయంలో ఎన్నికలకు వెళ్లడం అంటే సాహసంతో కూడిన పని. అందుకే చంద్రబాబు ఆ ఎన్నికలను బహిష్కరించారు.

# ప్రధాన పార్టీలను మట్టికరిపించిన కవిత

మహబూబ్ నగర్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ వేదికగా ఒక అరుదైన రాజకీయ సంచలనం నమోదైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు షాక్ ఇస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇక్కడ మొత్తం 10 వార్డులకు గాను ఏకంగా 8 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఘనవిజయం సాధించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో ఒక స్థానానికి పరిమితమయ్యాయి.ఈ విజయం వెనుక ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డేపల్లిలో బలమైన నేతగా పేరున్న వడ్డేపల్లి శ్రీనన్న కొద్ది రోజుల క్రితమే కవిత సారథ్యంలోని ‘తెలంగాణ జాగృతి’లో చేరారు. రాష్ట్రవ్యాప్తంగా జాగృతి నేతలు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ‘సింహం’ గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించగా, వడ్డేపల్లిలో శ్రీనన్న మద్దతుదారులు అదే గుర్తుపై బరిలోకి దిగారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో వారు సంచలన విజయం సాధించడంతో, ఈ గెలుపు కవిత రాజకీయ సత్తాకు నిదర్శనమని ఆమె మద్దతుదారులు సంబరాలు చేసుకుంటున్నారు.అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలు వడ్డేపల్లిలో



ఆశించిన ప్రభావం చూపలేకపోయాయి. కేవలం ఒక్కో సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సామాన్య ప్రజల్లో శ్రీనన్నకు ఉన్న పట్టు, జాగృతి శ్రేణుల సమన్వయం ఈ విజయానికి బాటలు వేశాయని స్థానికులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఈ ‘సింహం’ గుర్తు మరిన్ని మలుపులకు కారణమయ్యేలా కనిపిస్తోంది.

హంగ్ దిశగా...

తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాలుగ కార్పరేషన్లను కైవశం చేసుకుంది. బీజేపీ ఒకదాంట్లోపాగా వేసింది. మిగతా ఒక్కచోట మాత్రమే హంగ్ వచ్చే అవకాశం ఉంది. అందులో కూడా కాంగ్రెస్‌కు భాగం ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి. దీంతో ఒక్క కార్పొరేషన్‌లో కూడా కారుకు చోటు లేదని స్పష్టమవుతోంది. కాంగ్రెస్ పార్టీ రామగుండం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్‌లలో స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించింది. ఇంకా లెక్కింపు జరుగుతున్న మహబూబ్‌నగర్ కార్పొరేషన్లలో హస్తం పార్టీ ఆధిక్యంలో కొనసాగుతోంది. అక్కడ 60 డివిజన్‌లు ఉంటే వాటిలో 30కిపైగా డివిజన్‌లలో లెక్కింపు పూర్తి అయ్యింది. మిగతా స్థానాల్లో లెక్కింపు జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉంది. నల్గొండ కార్పొరేషన్‌లో 48 డివిజన్లు ఉంటే అందులో 27 చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగతా పార్టీలన్నీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. కారు పార్టీ అభ్యర్థులు 9 చోట్ల, బీజేపీ అభ్యర్థులు 4 చోట్ల, ఇతరులు 8చోట్ల గెలుపొందారు. రామగుండంలో ఉన్న 60 డివిజన్‌లలో 38 స్థానాల్లో కాంగ్రెస్ గెలుచుకుంటే... 13 మంది బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు గెలిచారు. బీజేపీ కేవలం ఒక్కటంటే ఒకటే గెలుచుకుంది. ఇతరులు 8 మంది విజయం సాధించారు. మంచిర్యాలలో 60 డివిజన్‌లకు 44 కాంగ్రెస్ కైవశం చేసుకుంది. బీఆర్ఎస్ 8, బీజేపీ 5 మాత్రమే గెలుచుకుంది. ఇతరులు ముగ్గురు గెలిచారు. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ వచ్చేసింది. అక్కడ ఆ పార్టీ పాలక మండలి కొలువుదీరనుంది. నిజామాబాద్ జిల్లాల్లో ఇంకా లెక్కింపు జరుగుతోంది. 60 డివిజన్‌లకు సగానికిపైగా డివిజన్‌లు కౌంటింగ్ పూర్తి అయ్యింది. ఇందులో ఎక్కువ స్థానాలు బీజేపీ దక్కించుకుంది. తర్వాత స్థానంలో స్వతంత్రులు, ఇతర పార్టీల నేతలు ఉన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ ఖాతా తెరవలేదు. కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సొంత కార్పొరేషన్ అయిన కరీంనగర్‌లో కమలం వికసించింది. అక్కడ 66 డివిజన్‌లు ఉంటే అందులో 30కిపైగా డివిజన్‌లను బీజేపీ కైవశం చేసుకుంది. ఇంకా లెక్కింపు జరుగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ రెండోస్థానంలో ఉంటే బీఆర్ఎస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. కొత్తగూడెంలో హంగ్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక్కడ ఏ పార్టీ ఎక్కువ డివిజన్‌లు గెలుచుకోలేకపోయింది. 60 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్‌లో వివిధ పార్టీలు చెందిన వాళ్లు 29 గెలుచుకుంటే కాంగ్రెస్ ఇరవై రెండింటిలో ఆధిక్యం కనబరిచింది. ఇక్కడ వామపక్షాలు కీలకం కానున్నారు. వారితో పాలకమండలి కైవశం చేసుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇక్కడ బీఆర్ఎస్ 8 డివిజన్లలోనే ఆధిక్యత చూపించింది. అయితే తమ మద్దతుతో పాలకమండలి ఛైర్మన్ కైవశం చేసుకోవాలని వామపక్షాలకు కేటీఆర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో ఇక్కడ రాజకీయం ఎలా మారుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

# అన్నామలై... ఏపీ నుంచి రాజ్యసభకు...

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు స్థానాల కోసం మే నెలలో నోటిఫికేషన్ రానుంది. అధికార కూటమిలో అప్పుడే సమీకరణాలు వేడెక్కాయి. ముఖ్యంగా కూటమిలోని మూడు పార్టీలు ఈ స్థానాలను ఎలా పంచుకుంటాయి? అభ్యర్థులు ఎవరు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.వచ్చే జూన్ 21తో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యుల పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలూ అధికార కూటమికే దక్కడం ఖాయం. ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం టీడీపీ 2 స్థానాలు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం ఉంది.జనసేన పార్టీకి కేటాయించే ఒక స్థానం కోసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండటం, ఆర్థికంగా అండగా నిలవడమే ఆయనకు సానుకూల అంశాలని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఇతర నేతలు కూడా ఉన్నప్పటికీ, సామాజిక, వ్యక్తిగత సమీకరణాల దృష్ట్యా పవన్ ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.తెలుగుదేశం పార్టీకి దక్కే రెండు స్థానాల్లో ఒకదానికి సానా సతీష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు టాక్. ఇక రెండో స్థానం కోసం టీడీపీలో భారీ పోటీ నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్లు, ఇటీవలే పార్టీలో చేరిన కీలక నేతలు ఈ సీటును ఆశిస్తున్నారు. అధిష్టానం మాత్రం సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేసే ఆలోచనలో ఉంది.అయితే బీజేపీ నుంచి ఎవరు ఎంపికవుతారనేది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఎవరి అంచనాలకు అందని విధంగా, అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఓ కొత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనే కె.అన్నామలై. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడైన అన్నామలైని ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపే వ్యూహంలో కేంద్ర బీజేపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. అక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించినందుకు అన్నామలై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశపెట్టడం ద్వారా ఆ అసంతృప్తిని చల్లార్చవచ్చని హైకమాండ్ భావిస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారిగా, ముక్కుసూటిగా మాట్లాడే నేతగా అన్నామలైకు దక్షిణాది యువతలో మంచి క్రేజ్ ఉంది. ఆయన రాజ్యసభలో ఉంటే దక్షిణాది సమస్యలపై గళం విప్పే అవకాశం ఉంటుంది. టీడీపీ యువనేత నారా లోకేశ్ కు, అన్నామలైకు మధ్య మంచి స్నేహం ఉంది. గతంలో అన్నామలై ఎన్నికల ప్రచారానికి కూడా లోకేశ్ వెళ్లారు. ఈ నేపథ్యంలో అన్నామలై అభ్యర్థిత్వానికి టీడీపీ నుంచి కూడా ఎటువంటి అభ్యంతరం ఉండే అవకాశం లేదు.మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు విజయసాయి రెడ్డి. అయితే ఇటీవల మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించిన విజయసాయి రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయన రాజ్యసభకు నామినేట్ అవుతారని కొందరు భావిస్తున్నప్పటికీ, అది బీజేపీ కోటాలో జరుగుతుందా లేదా అన్నది సస్పెన్స్. ఆయన ఇటీవల హిందూ ధర్మం, జాతీయ అంశాలపై చేస్తున్న వ్యాఖ్యలు బీజేపీకి అనుకూలంగా ఉండటం గమనార్హం.ఏది ఏమైనా, జూన్ రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మలుపులు తిప్పబోతున్నాయి. అన్నామలై వంటి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న నేత ఏపీ నుంచి వెళ్తారా? లేదా స్థానిక సమీకరణాలకే పార్టీలు మొగ్గు చూపుతాయా? అన్నది మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# కడప, బెంగళూరు కొత్త రైల్వే లైన్

కడప, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

ఏపీలో కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్రానికి రిక్వెస్ట్ వెళ్లింది. కడప నుంచి బెంగళూరుకు కొత్త రైలు మార్గంపై రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రైల్వే లైన్ రాయలసీమ అభివృద్ధికి కీలకమైనదని పురందేశ్వరి




వివరించారు. ఈ రైల్వే లైన్‌పై సమీక్ష చేసి పనుల్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుపై పలు కీలక అంశాలను ప్రస్తావించారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే ప్రాజెక్టులపై ఎంపీల నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళుతున్నాయి. తాజాగా మరో కొత్త రైల్వే ప్రాజెక్టుపై రైల్వేమంత్రికి రిక్వెస్ట్ అందజేశారు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి. రాయలసీమకు కీలకమైన కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ రైలు మార్గం రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకమైనదని పురందేశ్వరి అన్నారు. ఈ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి పునఃసమీక్షించి, పనులను వేగవంతం చెయ్యాలని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఏపీ రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ కూడా పురందేశ్వరి వెంట ఉన్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2008లో మంజూరు చేశారని.. మొత్తం 266 నుంచి 268 కి.మీ చేపట్టాల్సి ఉండగా.. కేవలం కడప-పెండ్లిమర్రి మధ్య 21 కిలోమీటర్ల మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. ఈ రైల్వే లైన్ ద్వారా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు.రాయలసీమ అభివృద్ధికి అత్యంత కీలకమైన కడప?బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును పరిశీలించి, త్వరితగతిన అమలు చేయాలని గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారిని కోరడం జరిగింది. 2008లో ఆమోదం పొందిన ఈ ప్రాజెక్ట్ ఇప్పటివరకు పరిమిత పురోగతితోనే కొనసాగుతోంది. జిల్లాలైన కడప, అన్నమయ్య ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ రైల్వే లైన్ ఎంతో కీలకం. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌కు ఊతం, బెంగళూరుతో నేరుగా రైల్వే అనుసంధానం, వరిశ్రమలు వృద్ధి, విద్యార్థులు, రోగులు, ఉద్యోగార్థులకు సౌలభ్యం, పర్యాటకాభివృద్ధి ఉపాధి అవకాశాలు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య విధానాన్ని మళ్లీ పరిశీలించి, సమన్వయం చేసి, తగిన సమయంలో పూర్తి చేయాలని కోరడం జరిగింది' అని పురందేశ్వరి పోస్ట్ చేశారు.ఈ కడప- బెంగళూరు మార్గాన్ని పులివెందుల మీదుగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముద్దనూరు- పులివెందుల- ముదిగుబ్బ- శ్రీసత్యసాయి మధ్య రూ.2,505 కోట్లతో 110 కి.మీ మేర లైన్‌కు సంబంధించి అడుగులు పడుతున్నట్లు రెండు నెలల క్రితం చర్చ జరిగింది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే బెంగళూరు త్వరగా చేరుకోవచ్చు

=====================

# జోష్ నింపుతున్న ఆత్మీయ కలయిక...

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం పాలన, రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజాప్రతినిధులతో కుటుంబ సభ్యుల తరహా బంధాన్ని పటిష్టం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. "ఆత్మీయ కలయిక ? ఇల్లే వేదిక" పేరుతో లోకేష్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా రాజకీయ భేటీలు అంటే వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కూడి ఉంటాయి. కానీ, లోకేష్ నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అందుకు పూర్తి భిన్నం. ఉండవల్లిలోని తన నివాసంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి, ఒక ఆత్మీయ విందును ఏర్పాటు చేయడం ద్వారా లోకేష్ అందరినీ ఆశ్చర్యపరిచారు.ఈ నూతన సంప్రదాయానికి తొలి వేదికగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నిలిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో సహా లోకేష్ నివాసానికి తరలివచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, చీఫ్ విప్ జీ.వి. ఆంజనేయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల వల్ల ఎంపీ బాలశౌరి, విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెనిగండ్ల రాము ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఈ కలయికలో లోకేష్ చూపిన ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచింది. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికుల నైపుణ్యానికి గుర్తింపుగా, వచ్చిన ఆడపడుచులందరికీ మంగళగిరి పట్టుచీరలను బహుకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఇది కేవలం బహుమతి మాత్రమే కాదు, తన నియోజకవర్గ నేతన్నల పట్ల ఆయనకున్న గౌరవానికి, అతిథుల పట్ల ఉన్న మర్యాదకు నిదర్శనం.ఈ సమావేశంలో కేవలం మాటలు, ముచ్చట్లే కాదు.. బాధ్యత కూడా కనిపించింది. గతంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి తాజా స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను లోకేష్ వారికి అందజేశారు. సమస్యలు చెప్పడమే కాదు, వాటి పరిష్కారం ఎక్కడి వరకు వచ్చిందో అధికారికంగా నివేదిక ఇవ్వడం లోకేష్ పనితీరులోని పరిణతిని చూపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ తరహా సమావేశాల వల్ల పార్టీ నాయకులను కేవలం రాజకీయ యంత్రాలుగా కాకుండా, ఒక కుటుంబంగా భావించడం వల్ల వారిలో పార్టీ పట్ల విధేయత, ఉత్సాహం పెరుగుతాయి. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరైతే, లోకేష్ ఆ క్రమశిక్షణకు 'ఆత్మీయత'ను జోడించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి నేరుగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా పాలనలో వేగం పెరుగుతుంది. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో మమేకం కావడం ద్వారా, నాయకులకు ఇంటి నుంచే పూర్తి మద్దతు లభించేలా చేయడం లోకేష్ దార్శనికతకు అద్దం పడుతోందిలోకేష్ చేపట్టిన ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం టీడీపీలో కొత్త జోష్ నింపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల నేతలతో ఇటువంటి భేటీలు జరగనున్నాయి. ఇది కేవలం ఒక డిన్నర్ మీటింగ్ మాత్రమే కాదు, భవిష్యత్తు నాయకత్వ పటిమను, పార్టీ పట్ల లోకేష్‌కు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పే ఒక రాజకీయ సంస్కరణగా చెప్పవచ్చు.

ఇక మండలిలో అయితే. పాలనను గాడిలో పెడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది కూటమి. అయితే అంతకుముందు ఉన్న ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన చాలా వాటిని పూర్తిచేస్తూ.. కొత్త వాటికి చెల్లింపులు చేస్తోంది. తాజాగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 1200 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో కీలక ప్రకటన చేశారు. జగన్ సర్కార్ 4వేల కోట్లను బకాయి పెట్టిందని గుర్తు చేశారు. దీనిపై శాసనమండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ తీరును తప్పుపడుతూ.. సభ నుంచి వాకౌట్ చేశారు.ప్రభుత్వ విద్యావ్యవస్థకు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలిలో పలు అంశాలను ప్రస్తావించింది.. ఈ క్రమంలో విశాఖలో గీతం విద్యాసంస్థల భూ కేటాయింపులతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయమై బొత్స ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు జరిపితే.. దానిని నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రిగా బొత్స ఉండే సమయంలో విజయనగరం జిల్లాలో ఆయన కుటుంబ సభ్యులు.. కొల్లాది రూపాయల భూములను కారు చౌకగా కొట్టేసారని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై శుక్రవారం చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం నడిచింది. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రి బొత్స ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైసిపి సభ్యులతో కలిసి శాసనమండలిని వాకౌట్ చేయడం విశేషం. అంతకుముందు సభలో విద్యావ్యవస్థ పై జరిగిన చర్చలో బొత్సతో మంత్రి నారా లోకేష్ వాగ్వాదానికి దిగారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు బొత్సపాఠశాల విద్యా శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రమంలో కొన్ని రకాల చెల్లింపులు, సక్రమంగా జరగలేదు. ప్రధానంగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు



విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలను అప్పటి జగన్ సర్కార్ విద్యార్థులకు అందించకుండా ఇబ్బంది పెట్టింది. ప్రైవేటు కాలేజీల్లో చేరే విద్యార్థులకు సైతం ఈ ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సామాన్య పేద విద్యార్థులు సైతం ప్రైవేట్ కాలేజీల్లో చేరారు. కానీ ఫీజు రీయంబర్స్మెంట్ మాత్రం చెల్లించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తూ వస్తోంది. నిన్ననే 1200 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని లోకేష్ ఈరోజు శాసనమండలిలో ప్రస్తావించేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు తట్టుకోలేకపోయారు. అందుకే బొత్స సభను వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటన చేసి బయటకు వెళ్లిపోయారు.

===============

# మూడేళ్ల ముందు నుంచే వర్క్ షురూ...

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు సమీపిస్తోంది. 2024 జూన్ లో వచ్చిన ఫలితాల్లో కూటమి ఏకపక్ష విజయం సాధించింది. 164 స్థానాల్లో గెలుపొందింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలంతా ఓడిపోయారు. అయితే మరోసారి అదే పట్టును కొనసాగించాలని చూస్తోంది కూటమి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ఓడిపోయిన నియోజకవర్గాలపై ఇప్పుడు దృష్టి పెట్టింది. మరోసారి అక్కడ కూటమి గెలిచేలా గట్టి ప్రణాళికలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో చాన్స్ ఇవ్వకూడదని భావిస్తోంది. అందుకే వైసీపీ కీలక నేతల నియోజకవర్గాల విషయంలో గట్టి పట్టుదలతోనే ఉంది. తాజాగా జరిగిన కలెక్టర్ల రివ్యూలో ఆ జిల్లా మంత్రులకు సైతం సీఎం చంద్రబాబు నిర్దేశించినట్టు తెలుస్తోంది. అభివృద్ధిని చేయడం ద్వారా వైసీపీ కీలక నేతలకు చాన్స్ లేకుండా చూడాలన్నది చంద్రబాబు ఆలోచనగా తెలుస్తోంది.వైసీపీ కీలక నేతలుగా చాలామంది ఉన్నారు. అటువంటివారు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. మరోసారి వారు గెలవకుండా ఉండాలని చూస్తున్నారు చంద్రబాబు. అందులో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఆర్కే రోజా వంటి వారు మరోసారి అసెంబ్లీకి రాకుండా చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. వారి విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక టాస్కులు ఇచ్చారు. అభివృద్ధి పరంగా చేపట్టాల్సిన అంశాల గురించి ఆయా జిల్లా కలెక్టర్లతో చర్చించారు సీఎం చంద్రబాబు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో నాటి జగన్ క్యాబినెట్లో ఉన్న వారంతా ఓడిపోయారు. ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమే గెలిచారు. అయితే ఈసారి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా ఓడించాలని చూస్తున్నారు చంద్రబాబు. ఎంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 40 శాతం ఓటు బ్యాంకు గురించి ఆలోచన చేస్తోంది తప్ప.. ప్రధాన నియోజకవర్గాల్లో పట్టు తప్పుతోందని గ్రహించడం లేదు. అయితే ఈసారి జగన్ మోహన్ రెడ్డి సైతం సీనియర్లను బరిలో దించే అవకాశం ఉంది. అయితే అటువంటి నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్న చంద్రబాబు ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం పరంగా కూడా అక్కడ ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. తద్వారా ఆ నియోజకవర్గాలను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తున్నారు. తాజాగా కలెక్టర్ల సదస్సులో దీనిపైనే కీలక ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో వారు మరోసారి గెలవకూడదు అన్నది చంద్రబాబు ప్రణాళికగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# అనీమియా బాధితుడికి సకాలంలో రక్తం అందజేత

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 15: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న గడ్డమీది బాపు రావుకి ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ప్రైవేటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ 25 వసారి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడని ఐ.వి.ఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.



ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 200 మందికి పైగా ఉన్నారని ఆ చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉందని ఆ చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని అన్నారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాత శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేశారు.

# దేవులపల్లి రమేశ్ కు రవీంద్ర భారతిలో సన్మానం



సిద్దిపేట,ఫిబ్రవరి15(భారత శక్తి ): హైదరాబాద్ రవీంద్రభారతిలో విమల సాహితీ సమితి,తెలంగాణ సాంస్కృతిక శాఖ,సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా.జెల్ది విద్యాధర్,సిరికొండ నరసింహారావు, రచించిన "యుద్ధం శాంతి "పుస్తక ఆవిష్కరణలో నంగునూర్ మండలనికి చెందిన రచయిత, కవి దేవులపల్లి రమేశ్,దేశామా నీకు ఇదేవందనం అనే కవిత గానం చేసినందుకు గాను సాహిత్య సేవలు అందించినందుకు ముఖ్యఅతిధి పద్మ శ్రీ కులకలూరి ఇనాక్, డాక్టర్ గోరేటి వెంకన్న, డా. బిక్కికృష్ణ,డా.రాధా కుసుమ, చేతుల మీదుగాహైదరాబాద్ రవీంద్రభారతిలో దేవులపల్లి రమేశ్,ఘనంగా సన్మానించారు. కవి రమేశ్ మాట్లాడుతూ.తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు భాష గొప్ప తనం మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.నాళేశ్వర శంకరం, శిఖామణి, కవులు,రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

## -జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు

వై ఎస్ ఆర్ కడప,ఫిబ్రవరి 15(భారత శక్తి) : ఈ నెల 16వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించు కోవాలని డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 16 వ తేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

" ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రా+=ా)" అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# విశాఖపట్నంలో భారత నౌకాదళ భద్రత, సన్నద్ధతను పరిశీలించిన డెహ్రాడూన్ జర్నలిస్టుల బృందం

విశాఖపట్నం, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 15:

పత్రికా సమాచార కార్యాలయం ఉత్తరాఖండ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం విశాఖపట్నంలో పర్యటించింది. 'సన్‌రైజ్ కమాండ్'



అని పిలిచే ఈస్టర్న్ నావల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో భారత సముద్ర భద్రత వ్యవస్థ, నౌకాదళ పనితీరును వారు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈస్టర్న్ ఫ్లీట్ (పూర్వీ బెడా) నౌక సందర్శన ద్వారా నౌకాదళ ఆధునిక సామర్థ్యాలు, వ్యూహాత్మక పాత్ర, స్వదేశీ రక్షణ ఉత్పత్తిలో జరుగుతున్న పురోగతిపై మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో అత్యాధునిక స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ ఉదయగిరి సందర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భారత నౌకాదళ యుద్ధ నౌకల డిజైన్ బ్యూరో దీనిని రూపొందించగా, మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ 'ప్రాజెక్ట్ 17ఏ ' కింద నిర్మించింది. ఇది తదుపరి తరం బహుళ–పాత్రల యుద్ధనౌకలకు మోడల్ గా నిలుస్తోంది. అత్యాధునిక స్టీల్త్ ఫీచర్లు, శత్రు రాడార్లకు చిక్కకుండా పయనించే సామర్థ్యంతో తయారైన ఈ యుద్ధనౌక, సంక్లిష్టమైన సముద్ర ప్రాంతాల్లోనూ సమర్థవంతంగా పనిచేయగలదు.ఐఎన్ఎస్ ఉదయగిరిలో అధునాతన నిఘా, రాడార్ వ్యవస్థలు, క్షిపణి సామర్థ్యాలు, యాంటీ సబ్ మెరైన్ వార్‌ఫేర్ ప్లాట్‌ఫారమ్‌లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు ఉన్నాయి. ఆధునిక నావిగేషన్, నెట్‌వర్క్–సెంట్రిక్ వార్‌ఫేర్ టెక్నాలజీల సాయంతో నౌకాదళంలోని ఇతర వ్యవస్థలతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేస్తుంది. ఈ పర్యటన సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ వికాస్ సూద్ నౌకపై జర్నలిస్టులకు స్వాగతం పలికి, నౌక పనితీరు, నౌకాదళ సంసిద్ధత గురించి వివరించారు.టెక్నికల్ బ్రీఫింగ్ సమయంలో విశాఖపట్నం డిఫెన్స్ పీఆర్ఓ కమాండర్ సుజిత్ రెడ్డి, లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ కుమార్‌తో కలిసి నౌకాదళ కార్యకలాపాలు, యుద్ధనౌకల పనితీరు, భారత సముద్ర ప్రయోజనాలను కాపాడటంలో నౌకాదళం పాత్రను వివరించారు. ప్రిన్సిపల్ వార్‌ఫేర్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కమాండర్ అంబ్రీష్ యాదవ్ మాట్లాడుతూ ఐఎన్ఎస్ ఉదయగిరి భారత స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యానికి నిదర్శనమని, ఇది భారత ప్రభుత్వ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను బలపరుస్తుందని చెప్పారు. యుద్ధ సన్నద్ధతతో పాటు మానవతా సాయం, విపత్తు సహాయక చర్యలు , సెర్చ్ అండ్ రెస్క్యూ మిషన్లు, సముద్ర భద్రతా కార్యక్రమాల్లోనూ ఈ నౌక పాల్పంచుకుంటోందని తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, స్థిరత్వం కోసం నౌకాదళం ఒక బలమైన శక్తిగా పని చేస్తోందని మీడియా ప్రతినిధులకు వివరించారు.జర్నలిస్టులు నౌకలోని ప్రధాన ప్రాంతాలైన బ్రిడ్జ్, ఆయుధాలు ఉండే ఫాక్సెల్ డెక్, హెలికాప్టర్ నిలిపే హ్యాంగర్, బోట్, టోర్పెడో ఫైరింగ్ డెక్‌లను సందర్శించారు. సముద్ర భద్రత సవాళ్లు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ వ్యూహాత్మక బాధ్యతలు, ఆధునిక యుద్ధంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన నౌకల ప్రాముఖ్యత గురించి అధికారులు మీడియా బృందానికి సమగ్రంగా వివరించారు.

భారత నౌకాదళ వృత్తి నైపుణ్యం, సాంకేతిక అధునాతనత, ఉన్నత ప్రమాణాలను మీడియా ప్రతినిధులు అభినందించారు. ఇటువంటి సందర్శనలు జాతీయ భద్రత, రక్షణ సన్నద్ధత, స్వదేశీ సాంకేతిక పురోగతిపై ఖచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. భారత రక్షణ స్వయం సమృద్ధిని, బలపడుతున్న నౌకాదళ సామర్థ్యాలను చాటిచెప్పడానికి ఈ మీడియా పర్యటన ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ఈస్టర్న్ నావల్ కమాండ్ కట్టుబడి ఉన్న తీరును ఈ పర్యటన తెలియజేసింది.

# సూర్యాపేట జిల్లాకు ధర్మ బిక్షం పేరు పెట్టాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 15:

సూర్యాపేట తొలి శాసనసభ్యుడిగా స్వతంత్ర సమరయోధుడు తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధులు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం పేరుని సూర్యాపేట జిల్లాకు నామకరణం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవనంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన 104వ జయంతి ఉత్సవాల



సందర్భంగా ఆయన ఫోటోకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణ తొలి హాస్టల్ నిర్మించి విద్యార్థులను విద్యాబుద్ధుల నేర్పించి చైతన్యవంతులను చేసి అనేక రంగాలలో తీర్చిదిద్దిన మహా నాయకుడు అని అన్నారు. జిల్లాకు పరిశ్రమల ఏర్పాటు చేసి యువకులకు ఉద్యోగాలు అవకాశాలు కల్పించాలని మరియు సాగు త్రాగునీరు గురించి అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన మహా నాయకుడు అన్నారు. దళిత పీడిత బడుగు బలహీన వర్గాల హక్కులను సాధించే విధంగా పోరాడిన ప్రజల నాయకుడు బొమ్మగాని ధర్మ బిక్షం అని కీర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి జయంతిని, వర్ధంతిని ప్రభుత్వ నిర్వహించి, హైదరాబాద్ ట్యాంకు బండి పై కాస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, మహా నాయకుని జీవిత చరిత్రను ముందు తరానికి తెలిసే విధంగా పాఠ్య పుస్తకాలలో వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ధర్మబిక్షం ఆశయాలను ముందు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, దోరేపల్లి శంకర్, సీనియర్ జర్నలిస్ట్ దేగల జనార్ధన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవేందర్ కుమార్, మాజీ కౌన్సిలర్ అనంతల మల్లేశ్వరి, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, సీనియర్ అడ్వకేట్ తలమల్ల హస్సేన్, శాంతి సంఘం జిల్లా అధ్యక్షులు తొగటి మురళి, గుగులోతు రాజారాం, యూత్ నాయకులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, మహిళ నాయకురాలు దంతాల పద్మ రేఖ, దేశ గాని హేమలత, రిక్షా యూనియన్ నాయకులు పెన్నా కృష్ణ వాడపల్లి వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకలే పట్టణాభివృద్ధికి కంచుకోటలు

# "ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు"

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు .పౌరుల చైతన్యం మీదనే పట్టణ ప్రగతి ఆధారపడి ఉంటుంది. ప్రశ్నించడం అనేది తిరుగుబాటు కాదు .అది బాధ్యతాయుతమైన పౌరుని లక్షణం. ప్రశ్న అభివృద్ధికి మూలం. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం అధికారులతో ప్రజాప్రతినిధులతో ప్రశ్నించినప్పుడే అభివృద్ధికి బీజం పడుతుంది. ప్రజల అవసరాలకుఈ అనుకూలంగా పాలన సాగాలంటే ప్రశ్న శక్తివంతమైన ఆయుధం ప్రశ్నించే గొంతుక ఉన్నచోట ప్రగతి పరుగులు తీస్తుంది .ా పట్టణాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు పౌరుల సమిష్టి కృషి జరిగినప్పుడే ఆశించిన సుందర ఆరోగ్యకరమైన నగరాలు నిర్మించుకోగలం.

సమస్యను ప్రశ్నించుబి పరిష్కారాన్ని సాధించు.



ప్రశ్నలేని చోట ప్రగతి స్తంభిస్తుంది. అభివృద్ధి మందగిస్తుంది.ప్రశ్న ఉన్న చోట ప్రగతి చిగురుస్తుంది. వార్డు /డివిజన్/ కౌన్సిలర్/ కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థును ఓటర్లు అడిగే ప్రశ్నలే పట్టణ ప్రగతికి దిక్సూచి.

ఓటు మన ఆయుధంబి అభివృద్ధి మన లక్ష్యం

పౌర సేవలు ప్రజల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలంటే పాలనలో పారదర్శకత పెరగాలి .ప్రశ్నించడం ద్వారా ప్రజాప్రతి నిధుల్లో

పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది.పట్టణ ప్రగతి సాధ్యమవుతుంది.

ప్రశ్నించే గొంతుకలే బిపట్టణాభివృద్ధికి కంచుకోటలు

పుర పాలకఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బాధ్యతాయుతమైన ఓటర్లు ప్రశ్నించండి? ఓట్ల కొరకు వచ్చే అభ్యర్థులను రాబోయే ఐదేళ్ల కాలంలో వార్డు/ డివిజన్/ పట్టణ అభివృద్ధికి ఏ విధమైన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తారో ప్రశ్నలతో నిలదీయండి.

ప్రశ్నించే గొంతుకలే పట్టణాభివృద్ధికి కంచుకోటలు. ఓటర్లు అడిగే ప్రశ్నలే ప్రజాప్రతినిధులకు విధానాల రూపకల్పనకు దిక్సూచిగా పనిచేస్తాయి.పట్టణ ప్రగతికి మార్గదర్శకమవుతాయి

పుర పాలక ఎన్నికల్లో వార్డు/ డివిజన్ /కౌన్సిలర్ /కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థులు ఓటర్ల వద్దకు వచ్చినపుడు అభ్యర్థిని నిలదీయండి ?ప్రశ్నించండి ? మీ ప్రశ్నలు భవిష్యత్తు వార్డు డివిజన్ పట్టణ అభివృద్ధికి దశ దిశగా నిలుస్తాయి.

మౌలిక సదుపాయాల కల్పన

మౌలిక సదుపాయాల కల్పన వానాకాలంలో వార్డులో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు .కొత్త రోడ్ల నిర్మాణం కోసం అభ్యర్థి దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి ?వానాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏ విధంగా ఆధునీకరిస్తారు.

వీధి దీపాలు బివెలుగు

వార్డ్/ డివిజన్/ పట్టణ పరిధిలో ఎల్ ఈ డి దీపాల ఏర్పాటుచేసి నిరంతరం వెలిగేలా చేసేందుకు ఏ విధమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు ?

ఆరోగ్యం మరియు పరిశుభ్రత

చెత్త సేకరణ ప్రతిరోజు క్రమబద్ధంగా జరిగేలా ఎలాంటి చర్యలు చేపడతారు. పట్టణంలో దోమల నివారణ . పొంగి పొరిలే మురికి కాలువల నిర్వహణ 'కాలవల్లో పేరుకుపోయిన పూడిక తీత' తాగునీటి సమస్యలు'ఈ గుంతల మయమైన రహదారులు నిర్వహణ లేని పార్కులు వైద్య సేవలు భూగర్భ డ్రైనేజ్ 'నాలాల ఆక్రమణ అడ్డుకోవడం. ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు.

పట్టణాభివృద్ధి పథకాలుబి చట్టాలపై అవగాహన

స్మార్ట్ సిటీ అమృత్ స్వచ్ఛభారత్ ఆవాస్ యోజన నిర్భయ ఫండ్ లాంటి పథకాలపై అవగాహన ఉందా? వీటికి నిధులు ఏ విధంగాఈ రాబట్టగలుగుతారు.

స్థానిక స్వపరిపాలన సాధికారిత సాధనకు మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉందా? లిప్రజారోగ్యం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగు పరచడం మరియు ఉచితంగా మందులు లభించడానికి తీసుకునే చర్యలు ఏమిటి?

ప్రజాపంపిణీ పథకం

ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో జరిగే అవకతవకలు అరికట్టి పేదలకు ఆహార వస్తువులను

బియ్యం గోధుమలు చెక్కర వినియోగ వస్తువులుసకాలంలో అందించే ఏర్పాటు కొరకు కార్యాచరణ ఉందా?

ఆహారభద్రత హక్కు రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు.

పబ్లిక్ ఆస్తుల రక్షణకు చర్యలు

పట్టణంలో ప్రభుత్వభూములు ఎండోమెంట్ భూములు అక్రమ కబ్జాల నివారణకు మీ వద్ద ఉన్న షెడ్యూల్ ఏమిటి? ఈ

ప్రజారోగ్యం

వైద్యం ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడం. భస్తీ దవాఖానాలల్లో ఆరోగ్య సేవలు ఉచిత మందుల లభ్యత జన ఔషధీ మందులను అందుబాటులో ఉంచడం . సీజనల్ వ్యాధుల నివారణ .దోమలు పందులు కోతులు కుక్కల బెడద నియంత్రణకు అభ్యర్థుల వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందా? ప్రశ్నించండి?

పిర్యాదులకు ప్రత్యేక బాక్స్

ప్రజల నుండి ఫిర్యాదుల ఫీడ్ బ్యాక్ కొరకు వాట్సాప్ నెంబర్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు సూచించండి.

మంచినీటి సరఫరా

తాగునీరు పర్యావరణం .ప్రతి ఇంటికి సరిపడా సురక్షితమైన మంచి నీరు సరఫరా చేయడానికి ప్రతి ఇంట ఇంకుడు గుంతల ఏర్పాటుకు అవలంబించే ప్రణాళిక ఏమిటి? వాడలో ఉన్న పార్కులు ఖాళీ స్థలాలను ఆక్రమణ నుండి కాపాడడం

చెట్లను పెంచడం పచ్చదనం పరిశుభ్రతకొరకు అమలు చేసే ప్రణాళిక ఏమిటి?

రిక్రియేషన్ సౌకర్యాలుబి ప్రణాళిక

సీనియర్ సిటిజన్స్ యువతకు అనుకూలంగా వార్డ్ డివిజన్ పట్టణ స్థాయిలో వాకింగ్ ట్రాక్స్ ఓపెన్ జిమ్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం రిక్రియేషన్ సౌకర్యాల ఏర్పాటు కొరకు ప్రణాళికలు ఉన్నాయా ప్రశ్నించండి

పర్యావరణ కాలుష్య నివారణకు చర్యలు

చెరువుల కాలుష్యాన్ని అరికట్టడానికి మీరు తీసుకునే చర్యలు ఏమిటి? చెరువుల సంరక్షణ పై ఎలాంటి ప్రణాళిక చేపడతారు. వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాటు కు తీసుకునే చర్యలు?

పురపాలనలోబి పారదర్శనికత

పుర పాలనలో పారదర్శకత మరియుజవాబుదారీ తనం మున్సిపాలిటీకి ఆర్థిక సంఘం కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు ఖర్చు వివరాలను ప్రజలకు తెలియచేయడానికి వార్డు /డివిజన్ స్థాయి ఓటర్ల / ప్రజల పట్టణ సభలు ( గ్రామసభల మాదిరి) నిర్వహిస్తారా ?

ప్రజలకు అందుబాటులో ఉంటారా?

ఎన్నికైన వార్డు/ డివిజన్/ కౌన్సిలర్ /కార్పొరేటర్ ఓటర్లకు /ప్రజలకు తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయంలో అందుబాటులో ఉండే సమయం నోటీస్ బోర్డ్ పై ప్రకటిస్తారా? .గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చారా? (పాత అభ్యర్థి అయితే)

మహిళల భద్రత

ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు ఏమిటి? మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరా లో ఏర్పాటు అసాంఘిక శక్తులపై ఎలాంటి నిఘా ఏర్పాటు చేస్తారు?

భవన నిర్మాణాల్లో అవినీతి నిర్మూలన

భవన నిర్మాణ అనుమతుల్లో జరిగే అవినీతి ఎలా అరికడతారు.భవన నిర్మాణాల్లో సింగిల్ విండో సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి

మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి?

కాలుష్య రహిత పర్యావరణహిత పరమైన వార్డు/ డివిజన్/ పట్టణాన్నీ /నగరాన్ని ఆరోగ్యవంతమైన సుందర నగరంగా నిర్మించడంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు తమ బాధ్యతలను మరవద్దు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయడానికి సూక్ష్మ స్థూల స్థాయి ప్రణాళికలతో పట్టణాల సుస్థిరాభివృద్ధికి పాటుపడుతారని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్యఅధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం తెలంగాణ వికాస వేదికకరీంనగర్9440245771

# సినిమా

## పెళ్లిపై మృణాల్ ఠాకూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



ఉత్తరాది భామ మృణాల్ ఠాకూర్ టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు, మృణాల్ పెళ్లి గురించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. తమిళ స్టార్ ధనుష్ ను ఆమె పెళ్లాడబోతోందంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. అలాంటిది ఏమీ లేదని ఆమె స్పష్టంగా చెప్పినప్పటికీ... ఈ పుకార్లకు చెక్ పడలేదు. ఈ అంశంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మృణాల్ స్పందిస్తూ... పెళ్లి అనేది జీవితంలో ఒక అందమైన మలుపు అని... తాను కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పింది. పెళ్లి చేసుకోవాలంటే సరైన వ్యక్తి, సరైన సమయం కావాలని తెలిపింది. ఎవరో అడుగుతున్నారనో, వయసు పెరిగిపోతోందనో తొందరపడి నిర్ణయం తీసుకోనని చెప్పింది. తన మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే... ఆ విషయాన్ని తానే స్వయంగా ప్రకటిస్తామని తెలిపింది. ఒక వ్యక్తితో జీవితాంతం కలిసి ఉండాలంటే మనసులు కలవాలని మృణాల్ అభిప్రాయపడింది. బలవంతపు బంధాల కంటే... ఇష్టమైన వ్యక్తి కలిసేంత వరకు వేచి ఉండటమే మేలని చెప్పింది. సినిమాల విషయానికి వస్తే... 'దో దినావే సెహర్ మే' సినిమాతో అలరించనుంది. టాలీవుడ్ లో అడివి శేష్ తో కలిసిన నటించిన 'డెకాయిట్' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. వీటితో పాటు మరికొన్ని చిత్రాల్లో కూడా మృణాల్ నటిస్తోంది.

## ఫ్రీగా సినిమా చూస్తూ.. అదే సినిమాను చంపేస్తున్నారు: కృష్ణవంశీ



టాలీవుడ్ లో అద్భుతమైన చిత్రాలను తెరకెక్కించి, ప్రేక్షకుల మదిలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కొద్ది మంది దర్శకుల్లో కృష్ణవంశీ ఒకరు. ఆయన తెరకెక్కించిన ఎన్నో సినిమాలు ఘన విజయాలను సాధించాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ని ఆయన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇటీవలి కాలంలో కృష్ణవంశీ జోరు తగ్గింది. మరోవైపు, ఏదైనా సినిమా విడుదల అయిన వెంటనే... రివ్యూలు వెల్లువెత్తుతున్నాయి. వాటిలో కొన్ని నెగెటివ్ రివ్యూలు కూడా ఉంటున్నాయి. ఇలాంటి రివ్యూలు ఇచ్చే వారిపై కృష్ణవంశీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సినిమా థియేటర్లోకి వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేస్తుంటారని... ఇలాంటి వారిలో 90 శాతం మంది మూర్ఖులేనని కృష్ణవంశీ అన్నారు. టికెట్ కూడా కొనకుండా వీళ్లు ఫ్రీగా సినిమాలు చూస్తారని... వెంటనే రివ్యూలతో ప్రేక్షకులను భయపెట్టేస్తారని విమర్శించారు. వారం రోజులు ఆగితే ప్రేక్షకులు సినిమా చూస్తారని... ఈలోగానే ఆడియన్స్ ను వీళ్లు భయపెడతారని మండిపడ్డారు. సినిమా లేకపోతే మీ బతుకే లేదు... అదే సినిమాను ఎలా నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సినిమా కోసం ఎంతో మంది కష్టపడతారని... వాళ్ల కష్టాన్ని తక్కువ చేయొద్దని అన్నారు.

## 'ధురంధర్'లో ఆ పాత్ర నాగార్జున చేయాల్సిందా?

బాలీవుడ్ సంచలన చిత్రం 'ధురంధర్'లో విలన్ పాత్రను తాను తిరస్కరించినట్లు వస్తున్న వార్తలపై టాలీవుడ్ కింగ్ నాగార్జున స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. ఇటీవల బాలీవుడ్ చిత్రం 'కూలీ'లో ప్రతినాయకుడిగా అద్భుతమైన నటన కనబరిచిన నేపథ్యంలో, 'ధురంధర్'లో అవకాశం వచ్చినా వదులుకున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది.రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఈ చిత్రంలో రెహమాన్ డెకాయిట్ పాత్రలో అక్షయ్ ఖన్నా నటనకు గొప్ప ప్రశంసలు దక్కాయి. అయితే, ఈ పాత్రకు మొదట నాగార్జునను సంప్రదించారని, 'కూలీ' సినిమా షూటింగ్ వల్ల ఆయన తిరస్కరించారని కథనాలు వెలువడ్డాయి.

## సీక్వెల్‌కు రెడీ



పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన హనుమాన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాన్ని నమోదు చేసి ఇండస్ట్రీని ఆశ్చర్యపరిచిన విషయం తెలిసిందే. రూ.45 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం కేవలం పది రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్ల వసూళ్లు సాధించి భారీ విజయాన్ని అందుకుంది. లాంగ్ రన్‌లో కలెక్షన్లు రూ.300 కోట్లు దాటిపోయి పాన్ ఇండియా రేంజులో బ్లాక్‌బస్టర్ ఫలితాన్ని సాధించింది. ఈ విజయోత్సాహంలో ఇప్పుడు అందరి దృష్టి సీక్వెల్‌గా రూపొందుతున్న జై హనుమాన్ పై పడింది. కన్నడ బ్లాక్‌బస్టర్ కాంతార సిరీస్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రిషబ్ శెట్టి ఇందులో ఆంజనేయుడి పాత్రలో కనిపించనుండడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఇప్పటికే రిలీజైన ఆయన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో విశేష స్పందన తెచ్చుకుంది. పలు సార్లు వాయిదా పడుతూ వచ్చిన షూటింగ్ ఈ నెల 22న లాంఛనంగా ప్రారంభం కానుంది. ఆద్యంతం హనుమంతుడి నేపథ్యంలో సాగనున్న ఈ చిత్రం విజువల్, మైథలాజికల్ పరంగా మరింత బలంగా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తోంది.

## మెగా డాటర్?



టాలీవుడ్‌లో మెగా 158 ప్రాజెక్ట్‌పై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. వాల్తేరు వీరయ్య సక్సెస్ తర్వాత మెగా స్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌కు ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. యాక్షన్‌తో పాటు తండ్రీ-కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ ఈ కథ నడుస్తుందన్న ప్రచారం ఉంది. చిరంజీవి కూతురి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో ఆ పాత్రలో ఎవరు నటిస్తారన్న చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మొదట కృతి శెట్టి పేరు వినిపించగా, తర్వాత బాలనటి నుంచి హీరోయిన్‌గా మారిన సారా అర్జున్ పేరు కూడా ప్రస్తావనకు వచ్చింది. అయితే తాజాగా ఈ కీలక పాత్ర కోసం మరో యువ నటి పేరు ఫైనల్ దశలో ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఛాంపియన్ మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ ఈ పాత్రకు దాదాపు ఫిక్స్ అయినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ భామ 2017లో మలయాళం లో విడుదలైన ఉహరణం సుజాత చిత్రం ద్వారా సినీ ప్రయాణం ప్రారంభించింది.

## ఇరుముడిలో కావేరిగా




మాస్ మహారాజా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ ఇరుముడి. శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా తండ్రికూతుళ్ల మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్ చుట్టూ ఈ కథ సాగనుందని సమాచారం. గత నెల 26న రవితేజ బర్త్ డే సందర్భంగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రివీల్ చేయగా.. తాజాగా మహా శివరాత్రిని పురస్కరించుకుని చిత్ర బృందం మరో అప్ డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోందని పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చింది.ఈమేరకు ఆమె ఫస్ట్ లుక్‌ను రివీల్ చేసింది. ఈ చిత్రంలో కావేరి అనే పాత్రలో ప్రియా భవానీ శంకర్ కనిపించనుందని పేర్కొంది. ప్రియా రవితేజ భార్యగా అభిమానులను మెప్పించనుంది. తాజాగా రిలీజైన ఈ పోస్టర్ సినీ ప్రియులను తెగ ఆకట్టుకుంటోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన టీజర్, విడుదల తేదీని ప్రకటించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## రేవంత్ రెడ్డిని కలిసి తన పెళ్లికి ఆహ్వానించిన విజయ్ దేవరకొండ

టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లిపీటలు ఎక్కబోతున్న సంగతి తెలిసిందే. ఈ నెల 26న రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఉదయ్ పూర్ లోని ప్యాలస్ లో ఇరువురి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనుంది. చాలా కాలంగా ప్రేమలో ఉన్న వీరు... చివరకు కుటుంబ పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ఉదయ్ పూర్ లో వివాహానంతరం ప్రముఖుల కోసం హైదరాబాద్ లో రిసెప్షన్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పెళ్లికి సమయం దగ్గర పడుతుండటంతో... విజయ్ దేవరకొండ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నాడు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ కలిశాడు. హైదరాబాద్ లోని రేవంత్ నివాసానికి వెళ్లి స్వయంగా పెళ్లి పత్రికను అందించాడు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండకు ముఖ్యమంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.







# చదువుతో పాటు ఇవీ ముఖ్యమేనట!

**తల్లిదండ్రులెప్పుడూ పిల్లలు బాగుపడాలనే కోరుకుంటారు. ముఖ్యంగా చదువు విషయంలో తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని ఆరాటపడుతుంటారు. ఇందుకోసం లక్షలు ఖర్చు చేసి ఉన్నత విద్యాసంస్థల్లో చేర్పిస్తుంటారు. ఎక్కువసేపు చదవాలంటూ వారిపై ఒత్తిడి తెచ్చే వారూ లేకపోలేదు. కానీ కేవలం చదువే కాదు.. కొన్ని ఇతర అంశాలపైనా దృష్టి సారించేలా పిల్లల్ని ప్రోత్సహించడం వల్ల వాళ్ల తెలివితేటల్ని పెంచచ్చంటున్నారు నిపుణులు.**

### విరామం మంచిదే..

పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని తల్లిదండ్రులు అదే పనిగా వారిని చదివిస్తుంటారు. కొంతమంది ప్రత్యేకంగా ట్యూషన్లు కూడా పెట్టిస్తుంటారు. అయితే ఇలా విరామం లేకుండా చదివించడం సరికాదంటున్నారు నిపుణులు. అందుకే ప్రతి అరగంటకో ఐదు నిమిషాల చొప్పున విరామమివ్వడం మంచిదని చెబుతున్నారు. తద్వారా మెదడుకు విశ్రాంతి లభించి వారిలో ఏకాగ్రత పెరుగుతుందంటున్నారు.

### పేపర్‌పై రాసేలా..!

ఈ డిజిటల్ ప్రపంచంలో చిన్నపిల్లల నుంచి పెద్దల దాకా ఏదైనా రాయాలంటే కీబోర్డ్‌నే ఉపయోగిస్తున్నారు. కానీ కీబోర్డ్‌పై టైప్ చేయడం కంటే చేత్తో రాసిన అక్షరాలనే మన మెదడు ఎక్కువగా గుర్తు పెట్టుకుంటుందట. తద్వారా ఆలోచనా శక్తి కూడా పెరుగుతుందట. అందుకే నేర్చుకున్న విషయాన్ని పేపర్‌పై రాసేలా వారిని ప్రోత్సహించాలంటున్నారు నిపుణులు. అప్పుడే వారికి విషయ పరిజ్ఞానం పెరుగుతుందని చెబుతున్నారు. ఇలా నోట్సే కాదు.. డైరీ రాయించడమూ మంచిదేనట!

### మెదడుకు పదును..

ఎప్పుడూ చదువు, చదువు అంటూ ఒత్తిడి చేసినా పిల్లలకు బోర్ కొట్టే అవకాశం ఉంటుంది. కాబట్టి వాటిని కొద్దిసేపు పక్కన పెట్టి సరదాగా వారితో మాట్లాడండి. ఈ క్రమంలో మెదడుకు పదును పెట్టే పొడుపు కథలు అడగండి. పజిల్స్ పూర్తి చేయమనండి. దీనివల్ల వారిలో సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు పెరగడమే కాకుండా చదువుపై కూడా ఏకాగ్రత పెరుగుతుందంటున్నారు నిపుణులు.

### దృఢంగా..

పిల్లలు మంచి మార్కులు సాధించాలంటే కేవలం చదువు ఒక్కటే సరిపోదు.. శారీరకంగా, మానసికంగా కూడా దృఢంగా ఉండాలి. ఇందుకు ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయి. కాబట్టి వారితో అవుట్‌డోర్ గేమ్స్ ఆడించాలి. ఉదయాన్నే కాసేపు వ్యాయామం, వాకింగ్, సైక్లింగ్.. వంటివి చేయించాలి. ఇవి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా ఏకాగ్రతను పెంచడానికీ దోహదం చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. అలాగే వారికి ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమూ ముఖ్యమే అంటున్నారు.

### తగినంత నిద్ర!





జ్ఞాపకశక్తి పెరగాలంటే మెదడు చురుగ్గా ఉండాలి. ఇందుకోసం శరీరానికి తగినంత నిద్ర అవసరం. కాబట్టి పిల్లలు రాత్రుళ్లు కనీసం 89 గంటల పాటు నిద్రపోయేలా చూడమంటున్నారు నిపుణులు. ఇందుకు అనువైన వాతావరణం కల్పించడమూ ముఖ్యమేనంటున్నారు.



# ఏ పాలు... ఎంత మేలు?

**'రోజూ ఓ గ్లాసు పాలు ఇస్తేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు, పుష్టిగా ఎదుగుతారు' అంటూ పెద్దవాళ్లు ఎంత చెప్పినా... 'పాలు ఎక్కువగా తాగితే లావైపోతారు, అరగకపోతే కష్టం' అంటూ చాలావరకూ పాలకు 'నో' చెబుతోంది ఈతరం. అంతేనా... స్వచ్ఛమైన ఆవు, గేదె పాలు దొరకడమే లేదు సరికదా- మార్కెట్లోనేమో ఎ2, ప్రొటీన్, డి విటమిన్ ఫోర్టిఫైడ్ రకాలూ... సోయా, బాదం, రైస్, ఓట్ మిల్క్ లాంటి సరికొత్త వెరైటీలెన్నో కనిపిస్తున్నాయి. అసలింతకీ వీటిల్లో ఏ పాలు మంచివో, ఎవరు ఏవి తాగాలో, వాటితో ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి!**



పాలు... మన ఫస్ట్ ఫుడ్. అప్పుడే పుట్టిన పసిపాపాయి నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన సూపర్ ఫుడ్ కూడా. రోజువారీ పనులు చేసుకోవడానికి కావాల్సిన శక్తితోపాటు ఎన్నో పోషకాల్ని అందించే సమతుల ఆహారం ఇది. కాల్షియం, ప్రొటీన్లూ, విటమిన్లను ఎంతో సులువుగా ఇచ్చే చక్కటి ఫుడ్ పాలు మాత్రమే. అది తెలిసే తరతరాలుగా పాలను రోజూ ఆహారంలో భాగం చేసుకుంటూ వచ్చాం. అప్పట్లో పొద్దున లేవగానే, రాత్రి పడుకునే ముందూ పాలు తాగేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నో అపోహలతో కొంతమంది పాలను ముట్టుకోవడమే మానేస్తున్నారు. కానీ రోజూ తగినన్ని పాలు తాగితే శరీరానికి అవసరమైన కాల్షియం దొరుకుతుంది. ఇంకా ఎముకల దృఢత్వానికి కావాల్సిన ఫాస్ఫరస్, శరీర జీవక్రియల్లో కీలకమైన బి12 విటమిన్లు కూడా అధిక మోతాదులో అందుతాయి. ఇలా పాలు చేసే మేలు గురించి చెబుతూ పాలను తప్పకుండా తాగాలంటూనే అందుకు సంబంధించిన సందేహాలన్నింటినీ నివృత్తి చేస్తున్నారు పోషకాహార నిపుణులు.

### ఏమేం లాభాలు...?

పాలు ముఖ్యంగా పిల్లల ఎదుగుదలలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఎముకల్నీ, దంతాల్నీ ఆరోగ్యంగా ఉంచుతాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు పెళుసు బారిపోకుండా చేస్తూ, ఆస్టియోపోరోసిస్ వ్యాధి నుంచి రక్షిస్తాయి. ఇంకా దీంట్లోని కాల్షియం గుండె జబ్బుల్నీ దరిచేరనివ్వదు. నాడీవ్యవస్థ మెరుగుదలకీ ఇది ఉపయోగపడుతుంది. అంతేకాదు... రక్తపోటు, మధుమేహ నియంత్రణలోనూ కాల్షియం అవసరమే! అంతేనా... రోజూ పాలు తాగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పాలతో శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెరిగి, తరచూ వచ్చే జలుబూ, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ దొరుకుతుంది. ఇందులోని ప్రొటీన్ కండరాల నిర్మాణానికి చాలా ఉపయోగపడుతుంది. అలసటను తగ్గించి, శరీరాన్ని ఎల్లప్పుడూ ఉత్తేజితంగా ఉంచుతుంది. ఆరోగ్యంగా బరువు పెరగాలనుకునేవాళ్లకు పాలు సరైన ఎంపిక. నిద్రలేమితో ఇబ్బంది పడేవాళ్లు గోరువెచ్చని పాలు తాగితే నిద్ర బాగా పడుతుంది, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఇంకా పాలలోని పొటాషియం, మెగ్నీషియం గుండె ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో మెదడు అభివృద్ధికి తోడ్పడే జింక్, కంటి ఆరోగ్యానికి అవసరమైన ఎ విటమిన్ కూడా ఎక్కువే. దీంట్లోని లాక్టోబాసిల్లస్ గట్ హెల్త్‌కి మంచిది.




**పోషకాలు**

| ఒక కప్పు ఫుల్‌క్రీమ్ పాలల్లో... | |
|---|---|
| శక్తి | : 150 కిలో క్యాలరీలు |
| ప్రొటీన్ | : 8 గ్రాములు |
| కొవ్వు | : 8 గ్రా. |
| పిండి పదార్థాలు | : 12 గ్రా. |
| కాల్షియం | : 6 మైక్రోగ్రాములు |
| విటమిన్ డి | : 3 మై.గ్రా. |
| **ఒక కప్పు టోన్డ్ మిల్క్‌లో** | |
| శక్తి | : 120 నుంచి 130 కిలో క్యాలరీలు |
| కొవ్వు | : 3 గ్రా. |
| **ఒక కప్పు డబుల్ టోన్డ్ మిల్క్‌లో** | |
| శక్తి | : 100 నుంచి 110 కిలో క్యాలరీలు |
| కొవ్వు | : 1.5 గ్రా. |
| **ఒక కప్పు స్కిమ్డ్ మిల్క్‌లో** | |
| శక్తి | : 80 నుంచి 90 కిలో క్యాలరీలు |
| కొవ్వు | : 0.5 గ్రా. |

అంతేకాదు.. పాలు అందాన్నీ పెంచుతాయి. ఇవి మంచి మాయిశ్చరైజర్‌లా పనిచేస్తూ, చర్మాన్ని పొడిబారనివ్వవు.

దీంట్లోని లాక్టిక్ ఆమ్లం మృతకణాలను తొలగించి చర్మానికి నిగారింపును తెస్తుంది, యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపైన వచ్చే ముడతల్ని నివారిస్తాయి. అందుకే ఎన్నో సుగుణాలున్న పాలను ఆయుర్వేదంలో ఔషధంగా వాడతారు. ఇలా శరీరాన్ని డీహైడ్రేట్ అవకుండా కాపాడటం దగ్గర్నుంచీ కొన్ని రకాల క్యాన్సర్లను దూరం చేయడం వరకూ పాలతో మనకు బోలెడు లాభాలున్నాయి.

### అసలు ఏ పాలు తాగాలి?

నేరుగా గేదె, ఆవుల నుంచి తీసుకొచ్చిన పాలు మంచివా, ప్యాకెట్ పాలు తాగాలా అన్న సందేహం చాలామందిలో ఉంటుంది. పాలు పితికినప్పుడు పరిసరాలు శుభ్రంగా ఉన్నాయో లేదో గమనించుకోవాలి. అలా తెచ్చుకున్న పాలను కచ్చితంగా వేడి చేశాకే తాగాలి. అలాగే ప్రత్యేక పద్ధతుల్లో పాలను శుభ్రం చేసే ప్యాకెట్ పాలూ మంచివే. అయితే ఇందులో మన ఆరోగ్య అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని ప్యాకెట్ పాల రకాన్ని ఎంచుకోవాలి. పాలలోని మొత్తం ఫ్యాట్స్‌తో ఫుల్‌క్రీమ్, ఆ కొవ్వు శాతాన్ని తగ్గిస్తూ టోన్డ్, డబుల్ టోన్డ్, స్కిమ్డ్ మిల్క్... ఇలా ఎన్నో రకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ అన్ని రకాల్లోనూ పోషకాలు ఒకేలా ఉంటాయి. కొవ్వు లేదా వెన్న శాతం మాత్రమే మారుతుంది. అంతేకాదు... పాలకు అదనంగా ప్రొటీన్లూ, విటమిన్లూ కలిపి ఫోర్టిఫైడ్ మిల్క్‌ని కూడా తీసుకొస్తున్నారు. కాస్త ఎక్కువ మొత్తంలో ప్రొటీన్లూ, ఎ, డి విటమిన్లు కావాలనుకునేవాళ్ల కోసమే ఇవి.

### ఎక్కడ కొనాలి?

కొంతమంది వ్యాపారులు పాలు చిక్కగా ఉండేందుకు పాల పొడి, నెయ్యి, యూరియా, సోడా లాంటి పదార్థాల్ని కలుపుతుంటారు. వాటి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. అందుకే ఎక్కడపడితే అక్కడ పాలు తీసుకోవడం, ఊరూపేరూ లేని పాల ప్యాకెట్లు కొనడం లాంటివి అస్సలు చేయకూడదు.

### * ఆవు పాలకూ గేదె పాలకూ తేడా ఏంటీ?

చిక్కగా ఉండే గేదె పాలల్లో కొవ్వు, ప్రొటీన్, కాల్షియం శాతాలు ఆవు పాల కన్నా రెట్టింపు స్థాయిలో ఉంటాయి. ఆ తేడా వల్లనే పలుచగా ఉండే ఆవు పాలు సులువుగా అరుగుతాయి. రుచితోపాటు వెన్న శాతం ఎక్కువగా ఉండాలనుకునేవాళ్లు గేదె పాలను ఎంచుకోవచ్చు.

### * పాలు ఎక్కువగా తాగడం వల్ల ఆడపిల్లలు చిన్నవయసులోనే రజస్వల అవుతున్నారని చెబుతున్నారు, అది నిజమేనా?

గేదెలకూ, ఆవులకూ ఇచ్చే ఆక్సిటోసిన్ హార్మోన్ల ప్రభావం అవి ఇచ్చే పాల ద్వారా మన మీద పడుతుందంటూ చాలామంది భయంతో పిల్లలకు పాలు ఇవ్వడం తగ్గిస్తున్నారు. కానీ ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. పాలను వేడి చేశాకే తాగుతాం కాబట్టి అందులోని అనారోగ్య కారకాలన్నీ దాదాపు తొలగిపోతాయి. తరచూ జంక్‌ఫుడ్ తీసుకోవడం, వ్యాయామం, శారీరక శ్రమ పూర్తిగా తగ్గిపోవడం వల్లనే ఆడపిల్లల్లో ఆ మార్పు కనిపిస్తుంది కానీ పాలు తాగడం వల్ల కాదు.

### 'ఎ2' పాలు అంటే ఏంటీ?

ఈమధ్య ఎ2 మిల్క్ అనేది మార్కెట్లో బాగా కనిపిస్తోంది. అసలేంటీ కొత్త రకం పాలు అంటే... సాధారణంగా మనం తాగే పాలల్లో ఎ1, ఎ2 అనే రెండు రకాల బీటాకేసిన్ ప్రొటీన్లు ఉంటాయి. ఎ1 విటమిన్ కొంతవరకూ కడుపు ఉబ్బరం, అజీర్తి, గ్యాస్ వంటి ఇబ్బందుల్ని కలగజేస్తుంది. అవన్నీ లేకుండా ఉండేందుకే డెయిరీ పాలలోని ఆ ప్రొటీన్‌ను పూర్తిగా తొలగించి ఈ ఎ2 మిల్క్‌ను తీసుకొచ్చారు. పిల్లలకూ, పెద్దలకూ ఏ సమస్యాలేకుండా సులువుగా అరగడమే ఈ పాల ప్రత్యేకత. కేవలం ఎ2 ప్రొటీన్‌తో ఉండే పాలతోపాటూ పెరుగూ, నెయ్యి లాంటి ఇతర డెయిరీ ఉత్పత్తులూ దొరుకుతున్నాయి.

### * డెయిరీ పాలు పడకపోతే ఏం చేయాలి?

పాలతో ప్రత్యేకంగా ఎలాంటి హానీ జరగదు కానీ ఇదివరకటి రోజులతో పోల్చితే ఈమధ్య 'లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్' అనే సమస్య బాగా పెరిగిపోయింది. జంతువుల పాలల్లోని లాక్టోజ్ పడకపోవడంతో కొంతమంది కడుపు నొప్పి, వాంతులూ, వికారం లాంటి జీర్ణసంబంధ వ్యాధులకు గురవుతుంటారు. గుండెకు సంబంధించి, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనేవాళ్లూ పాలలోని కొవ్వు శాతానికి భయపడుతున్నారు. ఇలాంటివాళ్లందరికీ డెయిరీ పాల స్థానాన్ని భర్తీ చేయడానికి ఎన్నో ప్రత్యామ్నాయాలు వస్తున్నాయి. వాటిల్లో బాదం, జీడిపప్పు, కొబ్బరి, సోయా, వరి, ఓట్స్... తదితర శాకాహార పాల వెరైటీలున్నాయి. డెయిరీ పాల కన్నా చక్కెర, కొవ్వు, క్యాలరీల శాతాలు వీటిల్లో తక్కువగా ఉంటాయి. ప్రొటీన్లూ, విటమిన్లూ, ఖనిజాలు మాత్రం అధికంగా అందిస్తాయి ఇవి. ఇంకా పల్లీలూ, బార్లీ, మొక్కజొన్న, అవిసెలూ, నువ్వులూ, క్వినోవా... ఇలా దాదాపు అన్ని రకాల గింజలూ, ధాన్యాల నుంచి తీసిన పాల రకాలూ వచ్చాయి. సరికొత్త రుచులతో ఎన్నో పోషకాలు ఇస్తున్నాయి ఈ పాలు. అందుకే నేరుగా తాగడానికే కాదు... రకరకాల వంటకాల్లోనూ వీటిని బాగానే వాడుతున్నారు!

### పాలు- ఎవరు ఎన్ని తాగాలి?

ప్రతి ఒక్కరూ పాలను రోజూ తీసుకోవాలి. ఏడాది వయసు నుంచి మూడేళ్ల పిల్లలకు 300 నుంచి 400 మిల్లీలీటర్ల పాలు ఇవ్వాలి. ఆ వయసు చిన్నారులకు చక్కెర లేకుండా ఇవ్వడమే మంచిది. ఎదిగే పిల్లలకు మరిన్ని పోషకాలు అవసరం కాబట్టి, నాలుగేళ్ల నుంచి టీనేజ్ వరకూ 720 మిల్లీలీటర్ల పాలు తాగొచ్చు. ముఖ్యంగా పుట్టిన పాపాయిలకూ, గర్భిణులకూ, ఆడవాళ్లకూ, వృద్ధులకూ పాలతో కావాల్సిన పోషకాలన్నీ అందుతాయి. పాలను రోజు మొత్తంలో ఏ సమయంలోనైనా తాగొచ్చు. ఓ గ్లాసు పాలు తాగి పడుకుంటే, అందులోని పోషకాలన్నీ శరీరానికి బాగా ఒంటబడతాయి కూడా. పాలలోని ట్రిప్టోఫాన్ వల్ల హాయిగా నిద్రపడుతుంది, చల్లటి పాలు తాగితే అసిడిటీ తగ్గుతుంది.

అందువల్ల అనవసరమైన సందేహాలను వదిలేసి... మన ఆరోగ్యానికి సరిపోయే పాల రకాన్ని ఎంచుకుని, కనీసం రోజుకు ఒక గ్లాసు పాలైనా తాగండి, వాటితో వచ్చే లాభాలతో పదికాలాల పాటు చల్లగా ఉండండి!

# అమ్మాయిల గది అందంగా!


**టీనేజ్ అమ్మాయిలు తమకంటూ ఓ ప్రత్యేక ప్రపంచం ఉండాలని కోరుకుంటారు. అందుకు అనుగుణంగా వారి గదినీ సిద్ధం చేయండి. ఈ మార్పులు సౌకర్యాన్నీ, స్టైల్‌నే కాదు... ఒత్తిడినీ తగ్గిస్తాయి అంటారు ఇంటీరియర్ నిపుణులు. అవేంటంటారా?**

సాఫ్ట్‌పింక్, లావెండర్, మింట్ గ్రీన్ కలర్స్ టీనేజీ గర్ల్స్ రూమ్‌కి చక్కని ఎంపిక. ఓ వైపు రంగు వేసినా... మరో వైపు ఫ్లోరల్ వాల్‌పేపర్‌నో, గర్లీ మోటివేషనల్ స్టిక్కర్స్‌నో అతికించి చూడండి. ఈ రంగుల్లానే వారి మనసూ ప్రశాంతంగా ఉంటుంది. కోజీ అట్మాస్ఫియర్ కోసం ఫెయిరీ లైట్స్, స్ట్రింగ్ లైట్స్... అలంకరిస్తే రూమ్ డ్రీమీగానూ ఉంటుంది. అలానే మంచం మీద సాఫ్ట్ పిల్లోస్, ఫ్లఫీ బ్లాంకెట్స్, కలర్‌ఫుల్ బెడ్ షీట్స్‌తో బోహో స్టైల్‌లో తీర్చిదిద్దండి. అది వారికెంతగానో నచ్చేస్తుంది. ఇలా మీరు తన మనసుకి మరింత దగ్గర కావొచ్చు. గదిలోనే ఓ మంచి స్టడీ టేబుల్, కంఫర్టబుల్ చైర్, పెద్ద మిర్రర్‌తో వానిటీ సెట్ చేయండి. షెల్ఫ్ ఏర్పాటు చేసి తన ఇష్టాలకు అనుగుణంగా కొన్ని పుస్తకాలను కొని పెట్టండి. ఇవి ఆమెకు చక్కటి అభిరుచిని అలవరుస్తాయి. అలానే, గది మూలల్లో ఇండోర్ ప్లాంట్స్, నచ్చినవి రాసుకోవడానికీ, మెచ్చినవి అతికించడానికి వాల్‌కీ ఏర్పాటు చేస్తే సరి. తనలోని సృజన వెలికి తీసేందుకు ఓ చక్కటి మార్గమిది. అయితే, ఇదంతా మినిమల్‌గా సిద్ధం చేయండి. ట్రెండ్‌నీ ఫాలో కావాలిగా మరి.



# అభివృద్ధే ధ్యేయంగా.. కాలనీవాసుల చెంతకు సేవలు!

* మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి కాలనీ సంక్షేమ సంఘం ఘన సత్కారం



ఎల్బీనగర్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : ఒక ప్రజాప్రతినిధికి అసలైన విజయం పదవిలో ఉన్నప్పుడు చేసే పనులే కాదు.. పదవి ముగిసిన తర్వాత కూడా ప్రజల నుంచి లభించే గౌరవమని బి.ఎన్.రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం నిరూపించింది. గత ఐదేళ్లుగా డివిజన్ అభివృద్ధికి, ముఖ్యంగా బి.ఎన్.రెడ్డి నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేసిన తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞత నీరాజనాలు అర్పించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..**

ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనలో లచ్చిరెడ్డి తనదైన ముద్ర వేశారని కొనియాడారు.

* మౌలిక వసతులు: అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి ఆయన తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు.
* నిరంతర అందుబాటు: సాధారణ ప్రజలకు సైతం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, సమస్య చిన్నదైనా పెద్దదైనా తక్షణమే స్పందించే తత్వం ఆయనను ప్రజా నాయకుడిగా నిలిపిందని పేర్కొన్నారు.
* ఆధ్యాత్మిక సేవా దృక్పథం: అభివృద్ధి పనులతో పాటు స్థానిక ఆలయాల అభివృద్ధికి, కాలనీ ప్రశాంతతకు ఆయన అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు బి.ఎన్. రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షులు రాములు, కార్యదర్శి ధనరాజ్, సహ కార్యదర్శి రవి కిరణ్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, అజయ్, కాశిరెడ్డి, హరి గోపాల్, రామచంద్ర మూర్తి, దేవి పోచమ్మ ఆలయ కార్యదర్శి బొజ్జ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొని మాజీ కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు.



గడ్డి అన్నవర క్షేత్రం సత్యనారాయణ స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భముగా మహా శివునికి మహాన్యాస ఏకవార రుద్రాభిషేకం పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పాల్థి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి భాషపాక సంతోష్, ప్రొద్దుటూరి కుమారస్వామి, బచ్చు సత్యనారాయణ భక్తులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, ఫిబ్రవరి 15 (భారత శక్తి):

# ఆర్భాటం వదిలి.. అనాథల చెంతకు!

* సేవాపథంలో 'బతుకమ్మ' హీరో విజయ్ భాస్కర్
* పుట్టినరోజున మానవత్వం చాటుకున్న నటుడు




ఎల్బీనగర్, ఫిబ్రవరి 15 (భారతశక్తి): వెండితెరపై 'బతుకమ్మ' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ భాస్కర్ తన పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. ఆర్భాటాలకు, వేడుకలకు దూరంగా ఉంటూ.. మానవత్వమే పరమావధిగా నగరంలోని 'రెడీ టూ సర్వ్' స్వచ్ఛంద సంస్థలో అనాథలు, వృద్ధుల మధ్య గడిపారు.

**ఆత్మీయ పలకరింపు.. ఆకలి తీర్చి..**

పుట్టినరోజు సందర్భంగా విజయ్ భాస్కర్ అక్కడ ఉన్న వృద్ధులను ఆత్మీయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. కేవలం అతిథిలా వచ్చి వెళ్లకుండా, అక్కడి వారికి స్వయంగా భోజనాలను వడ్డించి తన సేవాగుణాన్ని చాటుకున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు ఆడంబరాలకు ప్రాధాన్యత ఇస్తారని, కానీ విజయ్ భాస్కర్ ఇలా సామాన్యుల మధ్యకు వచ్చి పలకరించడం తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని అక్కడి వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.

**సమాజానికి స్ఫూర్తి:**

ఈ సందర్భంగా 'రెడీ టూ సర్వ్' నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ.. "విజయ్ భాస్కర్ లాంటి కళాకారులు సమాజానికి దిక్సూచి వంటి వారు. తమ పుట్టినరోజును సామాజిక సేవకు అంకితం చేయడం గొప్ప పరిణామం" అని కొనియాడారు. తోటి వారికి తోడ్పడటమే అసలైన పుట్టినరోజు కానుకని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి నిరూపితమైంది.




# హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

* సింగపూర్-హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్
* విమానం ల్యాండ్ అవగానే తనిఖీలు చేపట్టిన సిబ్బంది
* బాంబు లభ్యం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు

హైదరాబాద్ , ఫిబ్రవరి 15 (భారతశక్తి) : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మేరకు మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. ఆదివారం ఉదయం సింగపూర్‌హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులను కిందకు దింపి, తనిఖీలు చేపట్టగా, బాంబు లభ్యం కాలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపించారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఈ రెండు నెలల వ్యవధిలో శంషాబాద్ విమానాశ్రయానికి 23 నకిలీ బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కొన్ని ఫోన్ కాల్స్ విదేశాల నుంచి వచ్చినట్లు కూడా గుర్తించారు.

# హంగ్ మున్సిపాలిటీల కోసం కాంగ్రెస్ అరాచకం: కేటీఆర్

* కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
* 34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు
* కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ
* సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు



హైదరాబాద్ , ఫిబ్రవరి 15 (భారతశక్తి) : రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు. గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ హక్కులను కాపాడామని తెలిపారు.

# నిజామాబాద్‌లో బీజేపీ తప్పుకుంది కదా కరీంనగర్ మేయర్ పదవిపై పొన్నం ప్రభాకర్



కరీంనగర్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : కరీంనగర్ మేయర్ పదవిపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీయే దక్కించుకుంటుందని వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, మజ్లిస్ మూడు, ఇతరులు 10 స్థానాలు దక్కించుకున్నారు. ఇందులో ముగ్గురు ఇప్పటికే బీజేపీలో చేరారు. మేయర్ పదవిని దక్కించుకోవడానికి 34 కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఇక్కడ బండి సంజయ్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు వేయవచ్చు. ఈ క్రమంలో బీజేపీకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ, నిజామాబాద్‌లో మేయర్ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ధర్మపురి అరవింద్ ప్రకటించారని గుర్తు చేశారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు స్వయంగా ఎంపీ తెలిపారని అన్నారు. కరీంనగర్‌లో మెజారిటీ లేకుండానే మేయర్ పదవి దక్కించుకుంటామని బండి సంజయ్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లలో ప్రజాస్వామ్యబద్ధంగా మేయర్‌ను ఎన్నుకుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున అభివృద్ధికి సహకరిస్తామని, అందరినీ కలుపుకుని మేయర్ పీఠం దక్కించుకోవడానికి ప్రయత్నిస్తామని పొన్నం ప్రభాకర్ అన్నారు. మేయర్ పదవి దక్కించుకోవడానికి బీజేపీ ఎలాంటి ప్రయత్నాలు చేస్తుందో తామూ అదేవిధంగా చేస్తున్నామని అన్నారు. మేయర్, ఛైర్ పర్సన్ పదవుల కోసం క్యాంపు రాజకీయాలు ఉంటాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి

# ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

* ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బహుమతులు ఇచ్చిన అభ్యర్థులు
* మూడుచింతలపల్లి, మంచిర్యాల, భువనగిరిలో బహుమతులు వెనక్కి అడుగుతున్న అభ్యర్థులు
* ఇంటింటికి తిరిగి వసూలు చేసే ప్రయత్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు. సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీలోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన గొర్రెలకాపరి నాగమ్మ



నారాయణపేట, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : జీవితం ఎప్పుడైనా మారిపోవచ్చనేదానికి ఇది మరో ఉదాహరణ. ఏమాత్రం చదువు లేని ఒక అమాయకురాలు ఊహించని విధంగా ప్రజాప్రతినిధి అయిపోయింది. వివరాల్లోకి వెళితే... నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ఉండే బొడ్డేమొల్ల నాగమ్మ ప్రకృతిని నమ్ముకుని బతుకుతున్న ఒక సాధారణ గృహిణి. ఆమెకు చదువు లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అసలు తెలియదు. గొర్రెలను పెంచుతూ జీవనోపాధిని పొందుతున్న సామాన్యురాలు. కానీ, ఆమెను అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో నారాయణపేట మున్సిపాలిటీలో 19వ వార్డు నుంచి పోటీ చేయాలంటూ పట్టణ బీజేపీ నాయకత్వం ఆమెకు అవకాశం ఇచ్చింది. రాజకీయాలు తెలియని ఆమె... ధైర్యంగా తన భర్త అండతో ఎన్నికల బరిలోకి దిగింది. భర్తతో పాటు, వార్డులో ఉన్న యువత సహకారంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసింది. తనను గెలిపిస్తే గృహిణులకు, వ్యవసాయదారులకు బీజేపీ తరపున అండగా ఉంటానని... అందరి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ప్రచారం చేసింది. చివరకు ఎన్నికల్లో ఆమె జయకేతనం ఎగురవేసింది. తన ప్రత్యర్థి సరిత సతీశ్ గౌడ్ పై 154 ఓట్ల మెజార్టీతో 19వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందింది. ఎన్నికల్లో గెలుపొందిన నాగమ్మను ఇతర పార్టీల నేతలు కూడా అభినందిస్తున్నారు.

# రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు: అమిత్ షా

ఢిల్లీ, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. “70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది” అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

ఢిల్లీ, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. “చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది” అని ప్రకటనలో పేర్కొంది. ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్‌ఎఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక ‘ప్రొథోమ్ ఆలో’ కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు. ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు ‘ఓం నమః శివాయ’ నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. ‘హర హర మహాదేవ’, ‘శంభో శంకర’ అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్‌ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

అమరావతి, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. వివరాల్లోకి వెళితే, కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, ‘ఫుడ్ జిహాద్’ చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. “ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది” అని లోకేశ్ పేర్కొన్నారు. అంతేకాకుండా, “త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం” అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

అమరావతి, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు. ‘స్వర్ణాంధ్ర విజన్ 2047’ లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న ‘సంజీవని’ ప్రాజెక్టు పనితీరును ప్రభుత్వం ఆయనకు ప్రత్యేకంగా వివరించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశాల అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.

# నల్లమలలో బంజారాలకు మరో మేడారం..

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : రాష్ట్రంలోని బంజారా సోదరులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త వినిపించారు. ఆదివాసీలకు నాగోబా, మేడారం సమ్మక్కసారలమ్మ జాతరలు ఉన్నట్లుగానే.. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కి కూడా ఒక బ్రహ్మాండమైన పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన.. గిరిజన సంక్షేమం, అభివృద్ధిపై పలు కీలక వరాలు కురిపించారు.

**20 ఎకరాల భూమి కేటాయించాం**

“బంజారాలకు ప్రత్యేకమైన పుణ్యక్షేత్రం లేదన్న లోటును ఈ ప్రభుత్వం తీరుస్తుంది. నల్లమల అటవీ ప్రాంతంలో ఇప్పటికే 20 ఎకరాల భూమిని కేటాయించాం. అక్కడ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తాం. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను మనం అక్కడే ఘనంగా జరుపుకుందాం,” అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిని గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**తండాల రూపురేఖలు మారుస్తాం**

రాష్ట్రంలోని ప్రతి తండా, గూడెం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ప్రతి తండాకు తప్పనిసరిగా బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తాం. ప్రతి గ్రామ పంచాయతీలో సొంత భవనం, పాఠశాల భవనం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అటవీ ప్రాంతాల్లో కరెంట్ స్తంభాలు వేయలేని చోట, సోలార్ పంప్ సెట్ల ద్వారా మంచినీరు, విద్యుత్ అందిస్తాం.. అని రేవంత్ భరోసా ఇచ్చారు.

* **‘నేనే రాజు.. నేనే మంత్రి’.. అసలు అర్థం ఇదే!**

ఇటీవల తాను చేసిన ‘నేనే రాజు.. నేనే మంత్రి’ వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు సీఎం ఈ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. “నేను పాలకుడిని కాదు.. సేవకుడిని. మున్సిపల్ శాఖ మంత్రిని నేనే.. ముఖ్యమంత్రిని నేనే.. కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటముల బాధ్యత నాదే అని చెప్పే సందర్భంలో ఆ మాట అన్నాను. నా పనితనానికి ఈ ఎన్నికలే గీటురాయి అని చెప్పాను. కానీ కొందరు దీనిని వక్రీకరిస్తున్నారు. ప్రజా తీర్పు నాకు అనుకూలంగా వచ్చింది, అది నా బాధ్యతను మరింత పెంచింది,” అని రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు.

**చదువే గిరిజనుల ఆయుధం**

నిరుపేదలకు పంచడానికి ప్రభుత్వం దగ్గర భూములు లేవని, కానీ నాణ్యమైన చదువును అందించే బాధ్యత తమదని సీఎం అన్నారు. రూ.20 వేల కోట్లతో 100 నియోజకవర్గాల్లో ‘యంగ్ ఇండియా స్కూల్స్’ నిర్మిస్తున్నామని, గిరిజన బిడ్డలు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు పదవుల్లో సముచిత స్థానం కల్పించామని, స్పీకర్, మంత్రులుగా అవకాశం ఇచ్చి సామాజిక న్యాయం పాటించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సేవాలాల్ విగ్రహానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు.




## భారత్ బౌలర్ల ధాటికి పాక్ విలవిల.. 34 పరుగులకే 4 వికెట్లు డౌన్!

కొలంబో, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : కొలంబో వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. భారత్ నిర్దేశించిన 176 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. భారత పేసర్ల నిప్పులు చెరిగే బంతులకు సమాధానం చెప్పలేక కేవలం 34 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఛేదన ప్రారంభించిన పాకిస్థాన్‌కు హార్దిక్ పాండ్యా తొలి ఓవర్లోనే షాకిచ్చాడు. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్‌ను (0) డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత తన స్పెల్ ప్రారంభించిన జస్‌ప్రీత్ బుమ్రా.. ప్రమాదకర ఓపెనర్ సైమ్ అయూబ్ (6), కెప్టెన్ సల్మాన్ ఆఘా (4)లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చి పాక్ పతనాన్ని శాసించాడు. ఆ తర్వాత బాబర్ అజామ్ (5)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేయడంతో పాక్ నాలుగో వికెట్ కోల్పోయింది. దీంతో పాకిస్థాన్ 4.5 ఓవర్లు ముగిసేసరికి టాపార్డర్‌ను కోల్పోయింది. ప్రస్తుతం క్రీజులో షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ ఆడుతున్నారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77) మెరుపు అర్ధశతకంతో కదం తొక్కాడు. తిలక్ వర్మ (25), సూర్యకుమార్ యాదవ్ (32), చివర్లో శివమ్ దూబే (27) రాణించడంతో భారత్ పటిష్ట స్థితిలో నిలిచింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ మూడు వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం బాబర్ ఆజమ్, ఉస్మాన్ ఖాన్ క్రీజులో ఉండగా.. పాక్ విజయానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

# ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

ఫిబ్రవరి 15 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ఒక పూర్తిస్థాయి లీడర్‌గా ఎదిగే సత్తా ఉందని చాట్‌జీపీటీ సృష్టికర్త ‘ఓపెన్‌ఏఐ’ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ప్రశంసించారు. అందుకు అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయని అన్నారు. భారత్‌లో చాట్‌జీపీటీని వారానికి 10 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నారని, ఇది తమకు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 16 నుంచి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభం కానున్న ‘గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా కథనంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక యూజర్లు ఉన్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి యూజర్లు కూడా భారత్ నుంచే ఉన్నారని, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉద్దేశించిన ‘ప్రిజమ్’ అనే ఉచిత టూల్ వినియోగంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వచ్చే వారం తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఆల్ట్‌మన్ తెలిపారు. ఏఐని “భారత్‌లోనే, భారత్‌తోనే, భారత్ కోసమే” అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతేడాది ఢిల్లీలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది కార్యకలాపాలను మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏఐ ప్రయోజనాలను




అందరికీ అందించేందుకు ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏఐని క్షేత్రస్థాయికి చేర్చడానికి ‘యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీ’ అనే త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఇటీవలే నాలుగు భారతీయ నగరాల్లో 200 మందికి పైగా ఎన్జీవో ప్రతినిధులకు చాట్‌జీపీటీ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# 'బిల్డ్ నౌ'.. అవినీతికి అక్షయపాత్ర!

(హైదరాబాద్ - పరిశోధనాత్మక పాత్రికేయులు ఎం వేణుగోపాల్ వి.జీ)

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : భవన నిర్మాణ అనుమతుల్లో విప్లవాత్మక మార్పులు తెస్తామని, అవినీతికి తావులేకుండా నిమిషాల్లో అనుమతులు ఇస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన 'బిల్డ్ నౌ' (BuildNow) పోర్టల్.. ఇప్పుడు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గతంలో ఉన్న పారదర్శకతను తుడిచిపెట్టేస్తూ, అధికారుల జేబులు నింపే 'బ్రిబ్ నౌ' (BribeNow) గా రూపాంతరం చెందింది. ముఖ్యంగా TDR (Transferable Development Rights) సర్టిఫికెట్ల జారీలో జరుగుతున్న కుంభకోణం రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదిపేస్తోంది.

### * "TDR స్కామ్: నివాస స్థలానికి 'వాణిజ్య' విలువ!

ఈ కుంభకోణంలో దళారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు అనుసరిస్తున్న తీరు విస్తుగొలిపిస్తోంది. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానికి ఇచ్చే TDR సర్టిఫికెట్ విలువను అడ్డగోలుగా పెంచేస్తున్నారు.

మోసం ఇలా: ఒక ప్రాంతంలో నివాస స్థలం (Residential) కోల్పోయిన వ్యక్తికి ఆ విలువ ప్రకారమే TDR ఇవ్వాలి. కానీ, దళారులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అదే సర్వే నంబర్‌కు కమర్షియల్ (వాణిజ్య) వాల్యూ సర్టిఫికెట్‌ను సృష్టిస్తున్నారు.










అధికారుల పాత్ర: టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నకిలీ కమర్షియల్ వాల్యూను ధ్రువీకరిస్తూ భారీ విలువ గల TDRలను మంజూరు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఫీజులు ఎగ్గొట్టడమే కాకుండా, మార్కెట్లో ఆ సర్టిఫికెట్లను అమ్మి అక్రమంగా కోట్లు గడిస్తున్నారు.

### * చీకటి పోర్టల్.. అంతుచిక్కని ఫైల్ కదలిక!

గతంలో అమల్లో ఉన్న DPMS, TGbPASS వ్యవస్థల్లో దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉందో ప్రజలకు తెలిసేది. కానీ 'బిల్డ్ నౌ'లో ట్రాకింగ్ సిస్టమ్‌ను కావాలనే తొలగించారనే ఆరోపణలు వస్తున్నాయి.

### * గోప్యత ఎవరి కోసం?:

ఫైల్ ఏ టేబుల్ మీద ఉందో తెలియకపోవడంతో దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ, దళారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

షార్ట్‌ఫాల్స్ పేరిట వేధింపులు: చిన్న చిన్న కారణాలతో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టి, ఏజెంట్ల ద్వారా 'ముడుపులు' ముడితేనే క్లియర్ చేస్తున్నారు.

ఏఐ (AI) సాంకేతికతను పారదర్శకత కోసం కాకుండా, బాధ్యత నుంచి తప్పించుకోవడానికి అధికారులు డాలుగా వాడుకుంటున్నారు.

### * నిషేధిత భూముల్లోనూ అనుమతుల జాతర!

'బిల్డ్ నౌ'లో డేటా బహిరంగంగా అందుబాటులో లేకపోవడంతో అధికారులు బరితెగిస్తున్నారు.

ప్రభుత్వ భూములు: నాలా (Nala) కన్వర్షన్ లేకపోయినా, ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు కూడా దొడ్డిదారిన అనుమతులు ఇస్తున్నారు.

భద్రతకు తిలోదకాలు: ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని ఆసుపత్రులు, పాఠశాలలకు సైతం




భారీ వసూళ్లకు పాల్పడి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (OC) జారీ చేస్తున్నారు.

మార్టిగేజ్ ఎగవేత: ప్రభుత్వానికి తాకట్టు పెట్టాల్సిన స్థలాన్ని చూపకుండానే అనుమతులు మంజూరు చేస్తూ బిల్డర్లతో కుమ్మక్కవుతున్నారు.

### * న్యాయస్థానాలకు సైతం సవాల్!

ఈ వ్యవస్థలో అతిపెద్ద లోపం ఏమిటంటే.. ఒక అక్రమ అనుమతిపై కోర్టుకు వెళ్లినా, ఏ అధికారి ఆ నిర్ణయం తీసుకున్నారో నిరూపించడం కష్టతరం చేశారు. డిజిటల్ సంతకాలు, అస్పష్టమైన సాఫ్ట్‌వేర్ లాగ్‌ల వల్ల తప్పు చేసిన అధికారిని గుర్తించడం న్యాయస్థానాలకు కూడా సవాలుగా మారింది. ఇది ఉన్నతాధికారులు పక్కా ప్రణాళికతో చేసిన 'సిస్టమిక్ కరప్షన్' అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### * డిజిటల్ బినామీలు.. ఏజెంట్ల రాజ్యం!

ప్రతి మున్సిపల్ కార్యాలయంలో అధికారుల కంటే ప్రైవేట్ వ్యక్తుల (ఏజెంట్ల) హవాయే ఎక్కువగా ఉంది. ఏసీబీ దాడుల నుంచి తప్పించుకోవడానికి అధికారులు ఈ ఏజెంట్ల ద్వారానే డీల్స్ కుదుర్చుకుంటున్నారు. టెక్నాలజీ తెలిసిన ఈ ప్రైవేట్ వ్యక్తులే 'బిల్డ్ నౌ' లాగిన్లను హ్యాండిల్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనేది బహిరంగ రహస్యం.

### * ప్రభుత్వం తక్షణమే చేయాల్సింది:

పబ్లిక్ డొమైన్: ప్రతి అనుమతికి సంబంధించిన పూర్తి వివరాలు, లోపాలు, మరియు అధికారి పేరును వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

TDR ఆడిట్: గత రెండేళ్లలో జారీ చేసిన అన్ని TDRల వాల్యూయేషన్‌పై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (SIT) తో విచారణ జరిపించాలి.

లైవ్ ట్రాకింగ్: సామాన్యుడి దరఖాస్తు ఏ స్థితిలో ఉందో తెలిపే రియల్ టైమ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను మళ్ళీ పునరుద్ధరించాలి.

సాంకేతికత అంటే సామాన్యుడికి మేలు చేసేదిగా ఉండాలి కానీ, అధికారుల అక్రమార్జనకు అడ్డదారిగా మారకూడదు. మరి ఈ 'బ్రిబ్ నౌ' దందాపై ప్రభుత్వం ఎప్పుడు ఉక్కుపాదం మోపుతుందో వేచి చూడాలి.




మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్ట,జడ్జస్ కాలనీ,సహారా కాలనీ నందు జరిగిన పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ప్రజలందరికి మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల విఠల్ రెడ్డి, జగదీష్ యాదవ్,జక్కిడి రఘువీర్ రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు,కార్యకర్తలు, పలు కాలనీల అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, ఫిబ్రవరి 15 (భారత శక్తి):

# మహాశివరాత్రి ఆధ్యాత్మిక శోభ.. సంస్కరణల బాట..


- * వైభవంగా సంత్ సేవాలాల్ జయంతి
- * కాశీబుగ్గ శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు
- * పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : డంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలతో పాటు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### * నిజాయితీతో కూడిన జీవనమే సన్మార్గం



బాలాజీ టౌన్‌షిప్‌లో బంజారా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో నడవడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

### * మూఢనమ్మకాలకు స్వస్తి:

సమాజంలోని మూఢనమ్మకాలను వీడి, శాకాహారాన్ని భుజిస్తూ, నిజాయితీతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన చేసిన బోధనలు నేటికీ ఆదర్శనీయమని కొనియాడారు.

పాల్గొన్నవారు: మాజీ జెడ్పీటీసీ అనంత ప్రతాపరెడ్డి, కాలనీవాసులు, బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### * కాశీబుగ్గలో మహాశివునికి అభిషేకాలు

శివ నారాయణపురంలోని ప్రాచీన కాశీబుగ్గ శివాలయంలో మహాశివునికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పారిజాత నర్సింహారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హాజరైన ముఖ్య నేతలు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) తో పాటు పీసీసీ సభ్యులు దేపా భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్ రెడ్డి, భీమిలి చంద్రపాల్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పరమేశ్వరుడికి అభిషేఖం నిర్వహించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 15 (భారత శక్తి): మహేశ్వరం గ్రామంలో గల శివగంగ రాజ రాజేశ్వరి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేఖ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు ప్రజలందరికీ తెలియజేస్తూ, పరమేశ్వరుడి కృపాకటాక్షం ఎల్లవేళలా అందరిపై ఉండాలని, పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అలాగే సబితా ఇంద్రారెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కపిల్లలను దత్తత తీసుకోండి: మంత్రుల పిలుపు

- * కేబీఆర్ పార్కులో ఘనంగా 'ఇండీ పప్పీల' దత్తత మేళా

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (భారతశక్తి) : మన వీధుల్లో తిరిగే కుక్కపిల్లలకు ఆశ్రయం కల్పించి, వాటిని మన ఇంటి సభ్యుల్లా ఆదరించాలని రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ రేణుకా చౌదరి నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం బంజారాహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు ప్రాంగణంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'బీ ఏ హీరో.. అడాప్ట్, డోంట్ షాప్' (నాయకుడిగా నిలవండి.. దత్తత తీసుకోండి, కొనవద్దు) అనే నినాదంతో నిర్వహించిన దేశీ కుక్కపిల్లల దత్తత మేళాను వారు ప్రారంభించారు.

### * కుటుంబ సభ్యుల్లా ఆదరించాలి:

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఆది కాలం నుంచి కుక్కలు మానవుడికి అత్యంత నమ్మకమైన మిత్రులుగా ఉన్నాయని గుర్తుచేశారు. దేశీ కుక్కపిల్లలను దత్తత తీసుకోవడం వల్ల వీధుల్లో కుక్కల సమస్య తగ్గడమే కాకుండా, వాటికి సురక్షితమైన జీవితం లభిస్తుందని పేర్కొన్నారు. "దత్తత తీసుకున్న కుక్కపిల్లలను కేవలం జంతువుల్లా కాకుండా, మన ఇంట్లోని ఒక ఫ్రెండ్ లా, కుటుంబ సభ్యుడిలా ప్రేమతో చూసుకోవాలి" అని వారు సూచించారు.

### * ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి:

దత్తత తీసుకున్న యజమానులు తమ పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు (వ్యాక్సినేషన్) వేయించాలని, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు (స్టెరిలైజేషన్) చేయించాలని మంత్రులు కోరారు. ఇండీ కుక్కపిల్లల కోసం ఇలాంటి మేళాలను ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ యంత్రాంగాన్ని వారు అభినందించారు. భవిష్యత్తులో నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

### * విశేష స్పందన.. 30 పిల్లల దత్తత



వాలెంటైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ మేళాకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. మేళాలో డీవార్మింగ్, వ్యాక్సినేషన్ పూర్తి చేసిన 50 దేశీ కుక్కపిల్లలను ప్రదర్శనకు ఉంచగా, అందులో 30 పిల్లలను జంతు ప్రేమికులు దత్తత తీసుకున్నారు. మంత్రులు స్వయంగా పప్పీలను పరిశీలించి, దత్తత తీసుకున్న వారికి వాటిని అందజేసి అభినందనలు తెలిపారు. ప్రేమకు చిహ్నమైన ప్రేమికుల రోజున మూగజీవాల పట్ల ఈ విధమైన ఆత్మీయతను చాటడం మానవత్వానికి నిదర్శనమని అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.